సంపుటి : 06
సంచిక : 05

**శ్రమతో సేవ సేవతో కైవల్యం**

**నేపథ్యం : ఆనంద మార్గం**


కార్తిక పౌర్ణమి
నవంబర్ 19, 21

# ఆనందాశ్రమం




**శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్**

# అంకితము





**ఆచార్య శ్రీ భరద్వాజ మాస్టర్** **శ్రీ సుబ్బరామయ్య సార్**

**మమ్ములను నిరంతరం "సాయి శుభ్ర మార్గంలో" నడిపిస్తున్న సద్గురువులు ఆచార్య శ్రీ భరద్వాజ మాస్టర్, శ్రీ సుబ్బరామయ్య సార్ పాద పద్మములకు**

**సేకరణ :** సాయి శివ

**పర్యవేక్షణ :** శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ సభ్యులు

**ప్రాప్తిస్థానము :**

శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి, నెల్లూరు జిల్లా-524321

**SMST webpage :** http://saimastersevatrust.org/

# విషయ సూచిక


| | |
|---|---|
| ఆనందాశ్రమం - ప్రేరణ | 5 |
| ఎవరికి ఈ ఆనందాశ్రమం? | 6 |
| శ్రీ మాష్టారి ఆచరణ నుండి శ్రీ సార్ గమనించి అందించినవి | 8 |
| పరోపకారార్థమిదం శరీరం | 9 |
| శ్రీ సార్ ఆచరణ - డైరి విషయాలు | 15 |
| శారీరిక శ్రమ - నిష్కామ కర్మ | 17 |
| భక్తుల అనుభవాలు | 21 |
| శ్రీ సార్ లెటర్లు | 34 |
| మార్గ దర్శకాలు | 40 |
| నిత్య సత్యులు - ఇప్పటికీ, ఎప్పటికీ మార్గ దర్శకులు శ్రీ సార్! | 47 |
| ముక్తి ప్రదాత | 50 |
| శ్రీ శ్రీ శ్రీ సుబ్బరామయ్య సార్ సిద్ధాంత ప్రణాళిక | 54 |

# పరిచయము

శ్రీ సుబ్బరామయ్య సార్ గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి సన్నిధిలో జీవించి, వారి సేవ ద్వారా, వారి కృపను పొంది, వారి గురించి, శ్రీ భరద్వాజ మాస్టర్ గురించి అనేక గ్రంథాలు రచించి వాటి ద్వారా ధర్మ ప్రచారం విస్తృతంగా చేసి, సద్గురు తత్వం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ సద్గురువును ఆశ్రయించనిదే తృప్తి, శాంతి, ఆనందం కలగవని ఘంటాపదంగా బోధించారు. ప్రతి ఒక్కరూ శ్రీ సార్ మాటలను విని, తెలుసుకుని, ఆచరిస్తే వారిని శ్రీ వెంకయ్య స్వామి, శ్రీ భరద్వాజ మాస్టర్ గారు మరియు శ్రీ సార్ "శ్రీ సాయినాథుని శుభ్రమార్గం"లో నడిపించి ఆనందమును తప్పక పొందేలాగా చేస్తారని మా మనవి.

శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్
గొలగమూడి

# ప్రార్థన

శ్రీ సమర్థ సచ్చిదానంద సద్గురు పాదపద్మములు స్మరించినంత మాత్రమే ఈ భవ భయమును బాపు శ్రీ సుబ్బరామయ్య సార్ కి వందనములు. మీ లీలా స్మరణ చేత ఈ సృష్టి అంతా మీరు గాక మరి ఎవరూ లేరని తెలుపు ఈ లీలా విలాసునకు నమస్కారములు. నిరంతరము మమ్ము చూస్తూ ధర్మమార్గాన నడిపిస్తున్న మీకు జోహార్లు. శ్రీ స్వామి బోధించిన పంచశీల మార్గాన్ని వివరించిన మీకు దండములు. ఈ సృష్టిలో మీరు తప్ప ఇంకేమీ లేదని, ఆహారం, పానీయాలు, శ్వాస రూపాలలో నిరంతరము మా యందు ప్రవేశించి మాకు భక్తి, శ్రద్ధ, పట్టుదల, విజ్ఞానము, ఆరోగ్యము, శాంతి, ఆనందములను ప్రసాదించే మిమ్ము నిరంతరం గుర్తు పెట్టుకొనేటట్లు అనుగ్రహించమని ప్రార్థించుచున్నాము.

శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్
గొలగమూడి.

# ఆనందాశ్రమం - ప్రేరణ

శ్రీ సుబ్బరామయ్య సార్ మనలోని రాగ ద్వేషాలను తొలగించుకునే మార్గం 'నిష్కామకర్మ' అని గుర్తింప చేసి గొలగమూడికి వచ్చే భక్తుల ఆవాసానికి (సాయిమాస్టర్ నిలయం), సమాజ శ్రేయస్సుకు అవసరమైన నిర్మాణ కార్యక్రమాలలో (శ్రీ బ్రహ్మంగారి మఠం పునరుద్ధరణ, అనాధాశ్రమం, విద్యాలయం, ధ్యానమందిరం) శారీరిక, మానసిక, ఆర్థిక స్థాయిలలో సేవ చేసేవారు. ఆ విశ్వగురుని సేవించటానికి సార్ ఏమరుపాటు లేకుండా ఉత్సాహంతో పని చేసేవారు. అంతేగాక శ్రీ సాయిమాస్టర్ నిలయంలో ఎంతోమందికి స్వయంగా సేవచేసి స్వస్థత కలిగించారు.

కొంతమంది వెంకయ్యస్వామి భక్తులు ఎంతో దూరం నుండి స్వామి దగ్గరకు వచ్చి, ఆయన దగ్గరే కడ తేరుదామనే నిర్ణయంతో ఉంటారు. వారందరికీ ఒక ఆశ్రమం లాంటిది కట్టించాలని సార్ కొన్ని సంవత్సరాల పాటు స్థలం కోసం తీవ్ర ప్రయత్నం చేసారు. సార్ ఒకరితో "అమ్మా! వృద్ధాశ్రమం కట్టించమని చెప్పండి. ఇక్కడ తలదాచుకొను నీడ లేక వృద్ధులకు ఇబ్బందిగా ఉంది. తలదాచుకొను నీడ ఉంటే అందులో పడి ఉంటారు" అని చెప్పారు.

శ్రీ సార్ కి శ్రీవెంకయ్యస్వామి ఇచ్చిన సందేశం "శ్రమతో సేవ - సేవతో కైవల్యం". దానినే సార్ ఆచరించి, మార్గదర్శకంగా నిలిచి మనందరికీ స్ఫూర్తి నిచ్చారు. శ్రద్ధ, ఆసక్తి కలవారికి పై సేవలో పాలుపంచుకొనే అవకాశము శ్రీ సార్ "శ్రీ సాయి మాస్టర్ సేవట్రస్ట్" ద్వారా కల్పించారు.

శ్రీ సార్ సమాధి అనంతరం ప్రసాదించిన ప్రేరణను అనుసరించి సాయిమాస్టర్ నిలయం-2 లో **వృద్ధాశ్రమం ("ఆనందాశ్రమం")** నవంబర్ 11, 2021 న, శ్రీ భరద్వాజ

మాస్టర్ జన్మదినము (కార్తీక శుద్ద సప్తమి) న ప్రారంభించటమైనది.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, శ్రీ స్వామి వారి సన్నిధి, సేవలలో జీవితాన్ని గడప నిర్ణయించుకొన్న వారికి (ఆనందాశ్రమ వాసులకు), కార్య కర్తలకు, స్వచ్ఛంద సేవకులకు శ్రీ సార్, మాష్టారుల జీవనము, బోధల స్ఫూర్తితో గల ఈ "ఆనందాశ్రమం" అనే పుస్తకం మార్గదర్శకం కాగలదని ప్రార్ధన.

# ఎవరికి ఈ ఆనందాశ్రమం?

ఆనందం ఎవరికి కావాలి? ఎంత ఆనందం కావాలి? ఎప్పుడు కావాలి? చిన్న-పెద్ద అన్న బేధం లేకుండా, ఆడ-మగ అన్న వివక్షత లేకుండా, పల్లె-పట్టణ వాసులన్న సంబంధం లేకుండా, ప్రతి ఒక్కరికి, జీవిత చివరిక్షణాల వరకు (ఎల్లకాలం) అంతులేని ఆనందంలో ఓలలాడాలని ఉండదూ? అంతగా అందరమూ తపించిపోయే స్థితి పొందకుండా అడ్డుకుంటున్నదెవరు? ఒకే సన్నివేశం కొందరికి ఎంతో ఆనందం ఇస్తుంటే, కొందరు తటస్థంగా ఉంటే, మరికొందరికి విచారాన్ని కలిగించడం లేదా? ఉదాహరణకు: విమాన ప్రయాణం కొందరిలో ఆనందాన్ని, మరికొందరిలో భయాందోళనలు కలిగించడానికి కారణం? వారి వారి మనస్సు-ఆలోచనారీతి కాక మరే బాహ్యకారణం, ఇతరవ్యక్తులు కారణం కాదు గదా! **"మన ఏవ మనుష్యాణాం, కారణం బంధ మోక్షయో:"**

మరి అంతగా మనం కావాలనుకుని-పొందాలనుకునే ఆనందాన్ని, మన మనస్సే దూరం చేయడానికి కారణం?

**దారపు-లీలు:** **లీలు**కు(అంతర్యామి - ఆత్మస్తుడైయున్న సద్గురువుకు) చుట్టబడియున్న **దారం** (మనస్సు-ఆలోచనలు),

రీలును అంటిపెట్టుకొని ఉండక, వ్యర్థంగా బయటకు రావడం వల్ల చిక్కుపడి, నిరుపయోగం కావటమే గాక అనర్థదాయకం అయినట్లు! శ్రీ సార్ సాయిశివకు వ్రాసిన ఉత్తరంలో "**మనలో జరిగే ప్రతి భావ స్పందనకు కొంత శక్తి ఖర్చు అవుతుంది. మనసులో ఇతర ఆలోచనలు వస్తే అది మానసిక వ్యభిచారం అని భావించాలి. చేయవలసిన యోచన గాక మనసు దానంతట అది ఎక్కడికో వెళ్ళి ఆలోచించడమే వ్యభిచారం**" అంటారు. జాలరి పాదాల వద్దనున్న చేపలు ఆయన విసిరే వల(మాయ)లో చిక్కనట్లు, తిరుగలి పిడిని అంటిపెట్టుకొని ఉన్న గోధుమలు (ద్వంద్వాలనే) తిరుగలి రాళ్ళ మధ్య పడి నలిగిపోనట్లు, భగవంతున్ని సదా అంతరంగంలో ఆశ్రయించుకుని, అంటి పెట్టుకొని ఉన్నవారు ప్రపంచంలో ఎచ్చటఉన్నా, ఏఏ కార్యాలు నిర్వహిస్తున్నా **ఆనందాశ్రమవాసులే**!!

చిక్కుపడిన దారాన్ని సాఫీగా చేయడానికి చేసే ప్రయత్నంలో మరింత చిక్కుముడులు బిగించినట్లుగా, ఇష్టా(అ)ఇష్టాలతో ప్రేరేపించబడిన మనస్సు మరింత దుఃఖానికి-అశాంతికి కారణమవుతుందని, దానిని సాధ్యమైనంత సమయం సద్గురుపరం చేస్తే వారే ఆ చిక్కుముడులను విప్పడమే గాక, ఏ సమయానికి ఏది అవసరమో అది చేయిస్తారని సార్-మాస్టారులు సూచించారు. ఇట్టి శరణాగతి, అనన్యశరణాగతిగా (నేనే కర్తను అనే భావం సంపూర్ణంగా పోవడం) మారడానికి నిష్కామకర్మను శ్రమతో - ప్రయత్నపూర్వకంగా అభ్యసించాలని, అట్టి ఆంతరంగిక నిరంతర సద్గురు సాన్నిధ్యాన్ని అనుభవించే మహద్భాగ్యానికి చిహ్నంగా మరియు ఆలంబనగా ఈ బాహ్యామైన "ఆనందాశ్రమం" కార్యక్రమాలలో పాలుపంచుకునే అవకాశం కల్పించమని శ్రీ సార్ ను ప్రార్థిస్తూ వారి ఆచరణాత్మక జీవన విధానాన్ని, బోధలను స్మరించుకొని స్ఫూర్తిని పొందుదాము.

# శ్రీ మాష్టారి ఆచరణ నుండి శ్రీ సార్ గమనించి అందించినవి

**"అందరి యెడల ప్రేమ భావం వహించి సేవించి తరించడమే మాష్టారు గారు నాకు బోధించిన, నేర్పించిన, ఆచరించి చూపిన అత్యుత్తమ మార్గం. ఆచరిస్తే తరిస్తాను. వారి పంచకు చేరితే పాయసం వడ్డించారు. జుర్రితే అంతులేని ఆనందం - ఎంత జుర్రుకుంటే అంత ఆనందం" - శ్రీ మాష్టారుగారి బోధామృతం.**

దామోదర్ మరణించిన తరువాత దానికి కారణం శ్రీ మాస్టారుగారని, ఒక వ్యక్తి కత్తి పట్టుకొని వచ్చి నెల రోజులు శ్రీ మాస్టారును తిడుతూ వచ్చాడు. ఆ వ్యక్తే, ఆ తరువాత క్షమాపణకై వచ్చినా నువ్వేమి చేసావు, అందరికి అన్నీ చేసేది సాయియే అన్నది భావములో వెంట్రుక వాసి బేధం లేక వ్యక్తం చేసి వ్యవహరించటం "నమే భక్త ప్రణశ్యతి – నా భక్తుడు నశించడు, బాధ పడడు" అని వారు చెప్పిన వ్యాఖ్యకు ప్రత్యక్ష ఆచరణాత్మక గురు భక్తి. **గురు భక్తుడు పరిస్థితులపై కాక వానిని నియమించి నడిపే భగవంతుని పై దృష్టి ఎలా నిలపాలో నిలపవచ్చో** వారి జీవన ఆచరణలో చూడవచ్చు.

మాస్టారు "శ్రీ మాస్టారు అమృత లేఖావళి" లో ఒక letter లో ఒకరిని ఓదారుస్తూ "సాయి సేవలో తనకు ఆర్థిక నష్టం, అతి సన్నిహితులే సరిగా వారిని అర్థం చేసుకోకుండటం మొదలగు ఎన్ని అవాంతరాలు ఉన్నా, సాయి ఎలా తనను వారు పని సేవకై డిమాండ్ చేస్తున్నారో" వ్రాయటం లోనూ, వారి ఆర్థిక పరిస్థితి, అమ్మగారి అనారోగ్యం మొ|| సంఘటనలకు చలించలేదు. ఆ సమయంలోనే తదేక దీక్షతో మరింత ఉధృతంగా రచన, సత్సంగాలు మొ|| వానిలో నిమగ్నమవటం ద్వారా గురుభక్తిలో వారికి గల దీక్ష వెల్లడి అవ్వటమే కాక, ఎందరినో సాయికి పట్టివ్వటం ఉత్తమ గురు భక్తునిగా వారికే చెల్లింది.

# పరోపకారార్థమిదం శరీరం

***శ్రీ సార్ ప్రతిక్షణం ఈ విశ్వములోని ప్రతి జీవిని సద్గురు రూపంగా సేవించేవారు. సద్గురు శ్రీ దర్గాస్వామి, సుబ్బరామయ్య సార్ ను ఉద్దేశిస్తూ "పరోపకారార్థ మిదం శరీరం" అని అన్నారు :***

శ్రీ సుబ్బరామయ్య సార్ ఒకసారి గొలగమూడిలో ఒక పని చేయించటానికి వెళుతుంటే పైన బట్టలు లేకుండా నేలమీద పడిఉన్న ఒక ముసలావిడను చూసారు. ఆమె ఎంతో నీరసంతో ఉంది. పైగా ఆమె మల విసర్జన కూడా ఆమె ఉన్న చోట చేస్తోంది. అందువలన ఆ ప్రదేశం దుర్భరంగా ఉంది. ఆమెను నెల్లూరులోని మదర్ తెరీసా ఆశ్రమంలో చేర్పిద్దామనే ఉద్దేశ్యంతో ఆమెను అడిగితే ఆమె 'మా నాయనను అడిగి చెపుతా!" అని చెప్పింది. ఇంత ముసలావిడకి నాయనా ఉన్నాడా? అని ఆశ్చర్యంతో ఆమెను అడిగితే ఆమె చెప్పలేదు. సార్ అక్కడే ఉన్న మరొక ముసలావిడను అడిగితే ఆమె నవ్వుతూ **'వెంకయ్యస్వామియే ఆమె నాయన, ఇక్కడే కడ తెరుదామని ఇక్కడ ఉంటోంది'** అని చెప్పింది. సార్ ఆమెకు ఇష్టం లేకుండా తీసుకువెళ్లడం దేనికి అని అక్కడ నుండి బయలుదేరి కోనేటి వైపు వచ్చారు. అక్కడ ఒక పెద్దావిడ సగం చీరలో ఓపిక లేకుండా పడి ఉంది. సార్ ను చూడగానే ఏడుస్తూ 'దిక్కు లేని దానిని జ్వరం వచ్చింది' అని చెప్పింది. సార్ ఆమె పరిస్థితి చూసి "నీకు మాత్రలు ఇస్తే తగ్గదు, ఇంజక్షన్ ఇప్పించాలి, నేను డాక్టర్ దగ్గరకి తీసుకు వెళ్ళలేను. నిన్ను మదర్ తెరీసా ఆశ్రమానికి తీసుకు వెళతాను అక్కడ పూలలో పెట్టి చూసుకుంటారు" అని చెప్పారు. ఆమె ఒప్పుకోవటంతో ఆమెను మదర్ తెరీసా ఆశ్రమానికి పంపించారు. ఇలా ఎంతోమందిని సార్ మదర్ తెరీసా ఆశ్రమానికి పంపించారు.

పంపించటమే గాక అక్కడ సేవ చేసే విధానాన్ని (వచ్చిన వారు సాక్షాత్తు ఏసుక్రీస్తు అని వారికి నమస్కారం చేయటం, ఏ సమయమైనా అక్కడ వున్న సేవకులు విసుగు లేకుండా సేవ చేయటం, అంతేగాక అందరిచేత భగవంతుని ప్రార్ధన చేయించటం) గురించి విపులంగా చెప్పేవారు. చాలామందిని ప్రోత్సహించి ఆ ఆశ్రమంలో ఎలా సేవ చేస్తున్నారో గమనించమని చెప్పేవారు. కొంతమంది భక్తులకు అక్కడ ఉన్న రోగులు ఎంత దయనీయంగా ఉన్నారో చూసి రమ్మని అందువలన మనం ఎంత జాగ్రత్తగా జీవితాన్ని సాగించాలో చెప్పేవారు.

**సార్ సాయిలక్ష్మి గారికి చేసిన సపర్యలు మనందరికీ ఆదర్శ ప్రాయము. శివరత్నం మాటలలో:**

నేను సాయి మాస్టర్ నిలయంలో సార్ తో కూడా ఉంటున్న రోజులు. 2005 సంవత్సరంలో అనుకోకుండా ఒక ఆమె (పేరు సాయిలక్ష్మి, హైదరాబాద్) అనారోగ్యంతో బాధపడుతూ గొలగమూడి వచ్చి సార్ అనుమతితో సాయి మాస్టర్ నిలయంలో ఉంటూ శ్రీ వెంకయ్యస్వామిని సేవించుకుంటున్నది. ఆమెకు కొలైటిస్ అనే వ్యాధి ఉంది. ఆ రోగానికి మందు లేదని వైద్యులు చెప్పారు. చివరి ప్రయత్నంగా స్వామి దగ్గరికి వచ్చి సార్ ఆశ్రయాన్ని పొందింది. ఆమె చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. అన్నదమ్ములు ఉన్నప్పటికీ అనాధగానే జీవితం గడుపుతూ ఉంది. అప్పటికి ఆమె వయస్సు 45 సంవత్సరాలు వుంటుంది. ఆమె అనారోగ్యం కారణంగా వివాహం కూడా చేసుకోలేదు. ఇక నా అన్నవారు ఎవరూ లేరని శ్రీ స్వామివారే దిక్కని ఇక్కడకు వచ్చాను అన్నది. ఆమె పరిస్థితి విని చలించిపోయిన సుబ్బరామయ్య సార్ ఆమెకు సాయిమాస్టర్ నిలయంలోనే ఉండటానికి అన్ని సౌకర్యాలు ఇచ్చారు. ఇలా కొన్ని రోజులు గడిచిన తరువాత

ఆమెకు తన వ్యాధి పట్ల, జీవితం పట్ల విరక్తి చెంది ఎంతకూ ఈ వ్యాధి తగ్గేది లేదని బాధతో ఒక రోజు రాత్రి 60 మత్తు బిళ్ళలు నూరి నీళ్ళలో కలుపుకుని త్రాగేసింది. రోజు లాగా మాతోనే సాయి మాస్టర్ నిలయంలో పడుకున్నది. తను ఇలా చేసిన విషయం మాకు తెలియదు. రాత్రి 12 గంటలకు రియాక్షన్ వచ్చి ఒక్కసారిగా దెయ్యం అరిచినట్లుగా అరచి పడిపోయేది. నోటి గుండా నురుగు. ఆ సమయంలో సార్ ని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక నేను ఆమె ఫోన్ బుక్ చూసి విజయవాడలో ఉన్న వాళ్ళ అన్నయ్యకు ఫోన్ చేశాను. వాళ్ళన్నయ్య సమాధానం: 'ఆమె చచ్చిపోయినా కూడా మాకు సంబంధం లేదు. నేను రాను' అని ఫోన్ పెట్టేశారు. ఎలాగో ఉదయం 6 గంటలకు హారతి వరకు మా తంటాలు పడ్డాము. సార్ నేరుగా ఉదయం హారతి కి వచ్చి కూర్చున్నారు. ఆరతి జరిగాక రాత్రి జరిగినదంతా చెప్పాలని నేను హారతికి వెళ్ళాను. సాయిలక్ష్మి రాత్రంతా వేదనలతో అరచి అరచి స్పృహలో లేని స్థితిలో ఉంది. సాయిలక్ష్మిని సుబ్బరామయ్య సార్ గమనించాక నేరుగా లోపలికి వెళ్లారు. హారతి పూర్తయి ప్రసాదం తీసుకుని అందరం బయటికి వచ్చాము. సార్ కి నేను జరిగిన విషయం చెబుతూ ఉన్నాను. ఈ లోపల సాయి లక్ష్మి పైకి లేచి రెండడుగులు వేసి సార్ ముందే ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆ సంఘటన చూసిన సార్ కు ఇక నేను రాత్రి జరిగినది అంతా చెప్పవలసిన అవసరం లేకుండానే అర్థమైపోయిందనిపించింది.

ఇక ఆ రోజు నుండి సుబ్బరామయ్య సార్ ఆమె కోసం చేసిన సేవ అనన్యం అనిపించింది. ఆమెకు తోడబుట్టిన వాళ్ళు ఉండి కూడా ఎవరూ లేని అనాథగా మిగిలిపోయింది. రియాక్షన్ వల్ల పూర్తిగా మతిస్థిమితం కోల్పోయింది. బట్టలు ఊడిపోతున్నా తెలిసేది కాదు. మనుషులను గుర్తించలేదు. సార్ వీలైనంత వరకు వైద్యం చేయించారు. స్థానికంగా ఉన్న అందరూ ఆమెను చూచి భయపడి నేనేమీ చేయలేను అని చెప్పి

వెళ్లిపోయారు. ఇక ఆమె కొన ఊపిరితో ఉంది. ఈలోగా సార్ ఆటోను పిలిపించి నాతో "ఈమె చనిపోతుంది. నెల్లూరులోని స్మశానానికి తీసుకెళ్లి అని చెప్పి దహనం చేసి రా!" అని చెప్పి నా చేతిలో 300 రూపాయలు డబ్బులు, ఆటోలో కొనఊపిరితో ఉన్న సాయిలక్ష్మిని పెట్టి పంపించారు. ఆ పరిస్థితి సుబ్బరామయ్య సార్ కు అవలీలగా ఉంది. నాకు అగమ్యగోచరంగా ఉంది! సుబ్బరామయ్య సార్ మాటకు ఎదురు చెప్పలేక ఆటో తీసుకొని పోయాను. నేను నెల్లూరుకి పోయిన తర్వాత సాయిలక్ష్మి ఊపిరి ఆడుతూ ఉంది. సార్ కి ఫోన్ చేశాను. అప్పుడు సార్ మధర్ తెరిసా ఆశ్రమంలో చేర్పించమని అన్నారు. అక్కడ చేర్చిన తరువాత ప్రతి రోజూ ఎవరో ఒకరిని పంపిస్తూ ఆమె బాగోగులు తెలుసుకుంటూ ఉండేవారు. వారం రోజుల తర్వాత సాయి లక్ష్మి స్పృహలోకి వచ్చి మనుష్యులను గుర్తించడం ప్రారంభించింది. స్పృహలోకి వచ్చిన తర్వాత నాతో 'సుబ్బరామయ్య సార్ బాగున్నారా?' అని మొదటి మాట మాట్లాడి, ఇక్కడ నేను ఉండలేను సార్ దగ్గరికి వస్తాను అని బాధ పడుతూ చెప్పింది. అప్పటి ఆమె పరిస్థితి శరీరమంతా వాచీ నీరు పట్టి చాలా కురూపిగా ఉంది. నేను వచ్చి సార్ కి చెప్తే "రేపు పొద్దున్నే తీసుకొని రా" అని చెప్పారు. మరునాడు ఆశ్రమానికి తీసుకు వచ్చాను.

ప్రతిరోజూ సార్ ఆమెకు ఉదయం హారతి అయిన వెంటనే పళ్ళరసం మిక్సీలో వేసి తీసుకువచ్చేవారు. ఆవిడ ఆరోగ్యానికి సరిపడే కూర కూడా సార్ చేసేవారు. అన్నం మాత్రం నేను వండేవాడిని. ఇలా కొద్ది రోజులు గడిచిన తర్వాత ఆమె శరీర భాగాలకి వచ్చిన నీరు చీముగా మారి శరీరమంతా పుండ్లమయమయ్యింది. రెండు అరచేతులతో సహా పుండ్లు వచ్చాయి. ఆమెకు ఆహారం నోట్లో పెట్టవలసి వచ్చేది. ఆమెను పట్టుకోవటానికి అవకాశమే లేదు. చీముతో కూడిన పుండ్ల కారణంగా దుర్వాసన వచ్చేది. ఆమెను చూసి కొంతమంది

భక్తులు ఆశ్రమానికి రావడం మానేశారు. మరికొంతమంది 'ఈవిడ ఇక్కడెందుకు? పంపించవచ్చు కదా!' అని సలహా ఇచ్చిన వారితో సార్ "ఈ ఆశ్రమం కట్టింది ఇలాంటి వారి కోసమే, అని ఎందరెన్ని చెప్పినా పంపేది లేదు" అని నిక్కచ్చిగా చెప్పేశారు

ఉదయాన్నే వేడి నీళ్ళతో శరీర భాగాలను కడిగించేవారు. మేము కడిగేటప్పుడు చీముతో పాటు పెద్ద పెద్ద పురుగులు బయటకు వచ్చేవి. సార్ సాయి లక్ష్మి కి సేవ చేయటం చూస్తే మాకు సాయిబాబా భాగోజికి చేసిన సేవ గుర్తుకు వచ్చేది. ఇలా దరిదాపు రెండు మూడు నెలలు చేసిన తర్వాత వాళ్ల పెద్దన్నయ్య మలేషియా నుండి వచ్చి ఆమెను చూసి జాలిపడి హైదరాబాద్ కు తీసుకొని వెళ్ళారు. ఒక సంవత్సరం తర్వాత ఆమె ఆరోగ్యం బాగై మరల సార్ దగ్గరికి వచ్చి కృతజ్ఞతలు చెప్పుకున్నది.

ఇలా గొలగమూడిలో అన్నీ ఉండి కూడా అనాథలైన వారి కోసం సార్ చేసిన సేవలు చెప్పుకుంటూ పోతే ఒక గ్రంథమే వ్రాయవచ్చనిపిస్తుంది.

**మరి కొన్ని ఉదాహరణలు:**

శ్రీ సార్ కి గొలగమూడిలో ఒక పక్షవాత రోగి గురించి తెలిసిన వెంటనే అతనిని చూడటానికి శివరత్నం, ప్రసాద్ లను తీసుకుని వెళ్లారు. అతని యోగక్షేమాలు తెలుసుకుని అతనికి పెన్షన్ రావటం లేదని తెలిసింది. వెంటనే సార్ పెన్షన్ ఏ బ్యాంక్ (వెంకటగిరి) బ్రాంచ్ నుండి రావాలో తెలుసుకుని ఆ ఊరిలో ఉన్న సత్సంగ భక్తుల చేత కొన్ని వారాలు పెన్షన్ తెప్పించటానికి శ్రమించారు. అతనిని నెల్లూరు మదర్ తెరెసా ఆశ్రమంలో చేర్పించారు.

సార్ స్నేహితుడైన రాజ గోపాల్ అయ్యవారికి స్వామి సన్నిధి విలువ తెలిపి, గొలగమూడిలో ఉండేందుకు ఇంటి ఏర్పాటు స్వయంగా చేసారు. వారి ఇంటి నిర్మాణం పనులు సార్ దగ్గరుండి స్వయంగా చేసేవారు, చేయించేవారు. కాలాంతరంలో రాజగోపాల్ అయ్యవారికి పక్షవాతం వచ్చి కాళ్ళు పట్టుకు పోతే సార్ స్వయంగా వైద్యం చేయించారు. ఆ సమయంలో రోజూ వారింటికి వెళ్లి స్వామి లీలలు చెప్పి, నామం వ్రాయించేవారు. దానితో ఆయనకు పక్షవాతం తగ్గింది. తోడుండి బ్రహ్మంగారి మఠానికి సత్సంగానికి తీసుకువెళ్లి మరలా ఇంటిలో దింపే వరకు కూడా ఉండేవారు. వారి పక్షవాతం తగ్గాక కూడా రోజూ సత్సంగానికి ముందు వారింటికి వెళ్లి వారిని తోడ్కొని వెళ్ళేవారు. ఇలా కొన్ని సంవత్సరాల పాటు చేసారంటే ఏమి ఆశ్చర్యం లేదు!

సార్ గొలగమూడి వచ్చేవారికి ఎందరికో దైవమే అయినా చివరి వరకు రాజగోపాల్ అయ్యవారితో చక్కటి స్నేహితునిగానే మెలిగే వారు. అతి సామాన్యం అయిన సహా ఉద్యోగిగానే ఎంతో సహ్యంగా మెలిగేవారు. రాజగోపాల్ అయ్యవారు కూడా అలాగే చనువుగా వ్యవహరించే వారు. తరువాత కాలంలో రాజగోపాల్ అయ్యవారికి పెన్షన్ రావటానికి అవసరమైన ప్రయత్నం శ్రీ సార్ చేసారు.

మరో పక్షవాతం వచ్చిన పిల్లాడి కుటుంబానికి ఆశ్రయము ఇచ్చి స్వామి కృప వల్ల నయం అయ్యే మార్గం సూచించారు.

కాళ్ళులేని మరో భక్తునికి సాయి మాస్టర్ నిలయంలోకి wheelchair లో వెళ్ళటానికి జారుడు మెట్లు వాకిట ముంగిట ఏర్పాటు చేశారు.

ప్రసాద్ వాళ్ళ అత్తగారికి ఒంట్లో బాగో లేనప్పుడు గొలగమూడికి వస్తే సార్ తమ మంచాన్ని బాగు చేసి ఇచ్చారు.

సార్ తమ దగ్గర ఉన్న ఒక కోడు విరిగిన మంచానికి బస్తాలు కోడు క్రింద పెట్టి దానిని ఉపయోగించుకున్నారు.

# శ్రీ సార్ ఆచరణ - డైరి విషయాలు

**శ్రీ దర్గా స్వామి, శ్రీ సుబ్బరామయ్య సార్ ను చూపిస్తూ "పరోపకారార్థం ఇదం శరీరం" అన్నమాటకు సంబంధించిన కొన్ని డైరీ విషయాలు:**

చాలామంది వెంకయ్యస్వామి భక్తులు ఎంతో దూరం నుండి స్వామి దగ్గరకు వచ్చి ఆయన దగ్గరే కడ తేరు దామనే నిర్ణయంతో వచ్చిన వారు ఉంటారు. వారందరికీ ఒక ఆశ్రమం లాంటిది కట్టించాలని సార్ కొన్ని సంవత్సరాల పాటు స్థలం కోసం తీవ్ర యత్నం చేసారు. కానీ దొరకలేదు. శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం వారు స్థలం ఇస్తే కట్టిద్దామని అడిగితే ఆశ్రమ కమిటీ వారు ఒప్పుకున్నాక అక్కడ ఒక ఆశ్రమం కట్టించి ఇచ్చారు.

దాదాపు ఇదే సమయంలో జయమ్మ గారు, జయచంద్రారెడ్డి గారు దర్గాస్వామి కళ్యాణమండపం కట్టించాలని అందరి వద్ద సంతకాలు తీసుకుని కలెక్టర్ కు ఇచ్చి వచ్చామని చెప్పారు. సార్ వారితో "అమ్మా! దర్గాస్వామితో చెప్పండి. వృద్ధాశ్రమం కట్టించమని. ఈ కళ్యాణ మండపం ఎందుకు? ఉన్నవాళ్లు వచ్చి పెళ్లి చేసుకుపోతారు - ఎవరికీ పనికిరాదు. ఇక్కడ తలదాచుకుని నీడ లేక వృద్ధులకు ఇబ్బందిగా ఉంది. (బ్రతికి ఉండగానే మనుష్యులను చాపలు చుట్టి కోనేరు కట్టమీద పెట్టారు. ఒక ఆమె వచ్చి నాతో చెప్పగా

పోయి, చాప విప్పి చూస్తే ప్రాణం ఉంది. అట్లాంటి ఘోరాలు జరక్కుండా) తలదాచుకొను నీడుంటే అందులో పడి ఉంటారు అని చెప్పారు. జయచంద్రారెడ్డి గారు సార్ మీరే వ్రాసివ్వండి. స్వామికి మేము తీసుకుపోయి ఇస్తాము. మేము చెప్పే ధైర్యం లేదు అన్నారు. సార్ ఏమీ మాట్లాడలేదు.

24-11-2004

పోయిన వారం వెళ్ళినప్పుడు ఆదివారం రాత్రి ఏడు గంటల తర్వాత సార్ ఇంటి ఆవరణలో కూర్చుని మాట్లాడుతున్నారు. వేణుగోపాల్ గారు కూడా కూర్చుని ఉన్నారు. సార్ మాట్లాడుతూ మధ్యలో గొలగమూడిలో కాలువలో దిగడానికి మెట్లు కట్టించాలని ఉందని, గవర్నమెంట్ పర్మిషన్ తీసుకోవాలని చెప్పారు. అందరూ దిగటానికి వీలుగా, సేఫ్ గా మెట్లు కట్టించాలని ఉందని చెప్పారు. అలాగే అనాధాశ్రమం గూర్చి ఎప్పుడు చేస్తాడో స్వామి అని మాట్లాడారు. దాని స్థలం విషయం గురించి మాట్లాడారు. అసలు అక్కడెక్కడో మెట్లు అందరికీ వీలుగా ఉంటుందని కట్టాలని సార్ కి ఎలా ఆలోచన కలిగింది?

ఒకరోజు మధ్యాహ్నం ఎండలో లక్ష్మీనారాయణ గారి స్థలం రిజిస్ట్రేషన్ చేయించడం విషయమై ఒక ఆయన కోసం సార్ ఎంతోసేపు చాలా చోట్ల తిరిగారు. చివరకు ఆంజనేయస్వామి గుడి వద్ద వెతికి పట్టుకున్నారు. ఆయన ఏదో చెప్పారు. పని కాలేదనుకుంటూ వచ్చేటప్పటికి సార్ కి ఓపిక అయిపోయింది. నిజానికి అలా అంత సేపు ఆయన కోసం తిరగాల్సిన అవసరం ఏముంది? శ్రీ సార్ సత్సంకల్పమే, తరువాత కాలంలో, ఆ స్థలంలోని కట్టడం ఆనందాశ్రమంగా రూపుదిద్దుకుంది!

# శారీరిక శ్రమ - నిష్కామ కర్మ

సార్ దాదాపు తన వయస్సులో సగం ఉన్న భక్తుల కంటే కూడా ఉత్సాహంగా, స్ఫూర్తిగా శారీరకసేవ చేసేవారు. మే నెల మధ్యాహ్నం ఎండలకి సేవ చేసే భక్తులు, పనిచేసే కూలీలు భయపడి విశ్రమిస్తుంటే సార్ మాత్రం తలకు గుడ్డ కట్టుకుని, కాళ్ళకు చెప్పులేసుకుని ఉత్సాహంతో పనికి వెళ్ళేవారు. నిస్సందేహంగా ఆ విశ్వగురుని సేవించటానికి సార్ ఏమరుపాటు లేకుండా ఉత్సాహంతో పని చేసేవారు. అన్ని పనులూ సార్ అనుకున్న ప్రకారం జరిగేవి కావు (ఉదా|| ఒక్కొక్కసారి మేస్త్రీ కూలీలు వచ్చేవారు కాదు, రావాల్సిన ఇసుక, సిమెంట్ వచ్చేవి కావు) కానీ ఏ మాత్రం బాధ కానీ నిరుత్సాహపడటం కానీ అయ్యేవారు కాదు. తన పని తాను చేస్తూ ఉండేవారు. సార్ ఎవరినీ పని చేయమని అడిగేవారు కాదు. కానీ సార్ ను చూసి ఉత్సాహంతో, భక్తితో వచ్చిన భక్తుల చేత రకరకాల పనులు చేయించేవారు. సాయంత్రంకి చూసేసరికి ఎంతో పని అయ్యుండేది. అంతేగాకుండా సార్ గురించి తెలిసినవారు ఇసుక, సిమెంట్ ఇచ్చి తరవాత ఇమ్మనేవారు.  నిష్కామ కర్మ అంటే ప్రక్కవారికి చేసేదే కాదు మనస్సులో ఏ బాధ లేకుండా చేయటం ఆఖరికి మన స్వంత పనులు భగవంతుని సేవగా చేస్తే నిష్కామ కర్మ అవుతుందని చెప్పారు.

బ్రహ్మంగారి మఠం కట్టించడం, దారిలో వీధి పంపు కారుతూ రోడ్డుకడ్డంగా నీళ్లు రొచ్చురొచ్చుగా పారుతుంటే సార్ అక్కడ ఇసుక వేసి కట్ట వేయాలని చేయటం.

ఒకరోజు బ్రహ్మంగారి మఠంలో సత్సంగంలో సేవ చేయటం గురించి చెబుతూ - “ఆ రోజు ఒక మున్సిపాలిటీ ట్రాక్టర్ చెత్తంతా వేసుకు వెళుతోంది. దాని కుదుపులకు అందులో నుండి కర్ర తుమ్మ ముళ్ళు రోడ్డు మీద పడుతున్నాయి. రోడ్డు టర్నింగ్ లో చాలా ముళ్ళు పడ్డాయి. అందరూ వాటిని చూసి ఎగిరి దాటుకుపోతారే గాని ఒక్కరు కూడా తీయలేదు. నేను తీసి అవతల పారేశాను, అవి ఎవరికి గుచ్చుకున్నా ఆయనకే (స్వామికే) బాధ గదా అని స్మరించి! స్వామి సేవగా భావించి ఆ ముళ్ళను తీసి పడేయడానికి ఒళ్ళు బద్ధకం”

బ్రహ్మంగారి మఠం దగ్గర అ బావి వేసవికాలంలో ఎండిపోతుంది. చుట్టుపక్కల ఎన్నో కిలోమీటర్ల నుండి అందరూ ఆ బావిలో నీటితోనే గడుపుతుంటారు. ఎంతో దూరం నుండి వచ్చి ఎండలో అప్పటి దాకా కూర్చుని వేచి ఉంటే ఇంతలో ఎవరో వచ్చి తోడుకు పోతుంటారు. అలా అందరికీ ఇబ్బందిగా ఉంటుందని సార్ బ్రహ్మంగారి మఠం లోని బోర్ వేయించాలని సంకల్పించి దానికి తగ్గ ఏర్పాట్లు చేయిస్తూ, నీరు బాగాపడాలని సంకల్పంతో రోజూ పది నిమిషములు సత్సంగం ప్రారంభించే ముందు స్వామికి నివేదన చేయించగా నీరు బాగా పడ్డాయి.

వీధి కాలువలు త్రవ్విస్తున్నప్పుడు రోడ్డు ప్రక్కగా త్రవ్వారు. పూర్తి చేయటానికి కాలయాపన జరిగింది. ఆ సమయంలో స్వామి మందిరం మెయిన్ రోడ్ నుండి బ్రహ్మం గారి మఠంకు వెళ్లే దారిలో ఉన్న గుంటను దాటడానికి అక్కడ ఉండే వారు ఇబ్బంది పడుతుంటే సార్ ఒక భక్తుని చేత కాలువకు అడ్డంగా చెక్క వేయించారు. ఆ చెక్క వేసిన వెంటనే దాని మీద నడిచి వెళ్లిన ఒక వృద్ధురాలు ఆనందంగా కృతజ్ఞతలు, ఆశీస్సులు ఇచ్చింది. అది చూసిన సార్ మురిసిపోయారు.

శ్రీ భరద్వాజ మాస్టారు దగ్గరకు విద్యానగర్ వెళ్ళినప్పుడు కూడా సార్ తన వంట తాను చేసుకునేవారు. అక్కడ ఉన్న హోటల్ లో అన్నం సరిగ్గా ఉండేది కాదు. అందువలన భరద్వాజ మాస్టారు దగ్గర ఉండే భక్తులు కూడా సార్ దగ్గర తినేవారు. ప్రతిరోజూ మూడు పూటలా దాదాపు 40 మందికి ఆహారాన్ని సమకూర్చేవారు. ఒకసారి చాలా అన్నం వారుస్తూ ఉంటే భరద్వాజ మాస్టారు చూసి సార్ ని అడిగి తెలుసుకుని "ఎందుకండీ మీకు ఇబ్బంది కదా!" అంటే సార్ "సాయి సేవగా చేస్తున్నాను" అంటే భరద్వాజ మాస్టారు మురిసిపోయి అందరికీ కావలసిన పదార్థాలు తెచ్చుకోమని ఉత్తర్వు ఇచ్చారు. సార్ సేవ చేయటమే కాదు ఆ భక్తుల రూపంలో సాయిబాబా ఉన్నారనే భావన ప్రస్ఫుటంగా ఉంది కాబట్టి అంత పనిని ఎవరూ సాయం చేయకపోయినా ఏనాడూ ఇబ్బందిగా అనుకోలేదు.

శ్రీ భరద్వాజ మాస్టారు శ్రీ సాయి నాధుని వద్ద అనుభవం పొందాక శ్రీ సాయినాధుని జీవిత సంఘటనలను సేకరించడంలోను, సాయిబాబాతో ప్రత్యక్ష అనుబంధం ఉన్న వారి అనుభవాలు ముఖత వినుటకు ఎంత శారీరిక ఆర్ధిక శ్రమ కోర్చి రోజుల తరబడి నిరీక్షించి సేకరించడం మాష్టారి గురు భక్తికి నిదర్శనం. ఒక సారి ఒక ప్రత్యక్ష శిష్యుని ముఖత ఒక అనుభవం వినుటకు 3 రోజులు ఎక్కడో వారి ఊరిలో ఒక్క జత బట్టలతో తగిన అన్న–పానాదులు లేకనే నిరీక్షించవలసి వచ్చింది. గురు మహిమ తెలుసుకోడానికి మన అందరికి అందించడానికి మాస్టారు వహించిన గురు భక్తికి ఇది ఒక మచ్చుతునక.

**శ్రీ సార్ దగ్గరికి వచ్చేవాళ్ళకు, శ్రీ స్వామిని దర్శించి సార్ దగ్గరకి వచ్చేవాళ్లకు, శ్రీస్వామిపై భక్తి విశ్వాసములు పెంపొందేందుకు, శ్రీ సార్ ఈ క్రింది మాటలు చెప్పేవాళ్ళు :**

1. శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర, శ్రీ సాయి చరిత్ర లేక ఇష్టమైన మహాత్ముని చరిత్ర పారాయణ చేయమని చెప్పేవాళ్ళు.
2. దీక్షగా, త్రికరణ శుద్ధిగా నామము స్మరించు అని చెప్పేవాళ్ళు.
3. ధుని సేవ చేయమనే వారు. నామస్మరణతో ఆహారం, సాంబ్రాణి, నవధాన్యాలను ధునికి శ్రద్ధతో సమర్పించటం
4. శ్రీ స్వామి మందిరానికి గాని, ధునికి గాని, కుటీరానికి గాని 108 ప్రదక్షిణలు తక్కువ కాకుండా లేక టైం నిర్ధారించుకుని ఆ టైము ప్రకారము చేయమని చెప్పేవారు.
5. శ్రీ స్వామివారి పంచశీల సూత్రములను ఆచరించమని చెప్పే వారు.

తన దగ్గరకు వచ్చిన వారందరికీ మహనీయుల దివ్యానుభవాలు చెప్పి శ్రీస్వామిని సేవించుకునేందుకు ప్రోత్సహించేవారు. దీనితో శ్రీ స్వామి భక్తులు, శ్రీ సార్ కు దగ్గరికి వస్తే, శ్రీ సార్ అభయము, అనుగ్రహములతో వారి తపస్సు శక్తి ధార పోసి శ్రీ స్వామి చెప్పినట్లుగా వారి చేత చేయించి శ్రీ సద్గురు కృప, అనుగ్రహాల ద్వారా వారి కష్టాలు తొలగించేవారు. వారు కొంత మానసిక శాంతి, ఉల్లాసముతో శ్రీ సార్ ను సద్గురువుగా గుర్తించి సేవించేవారు. అట్టి కొందరికి శ్రీ సార్ సాంగత్యంలో ప్రసాదింపబడిన అనుభవాలను చూద్దాము.

# భక్తుల అనుభవాలు

శ్రీ సార్ బ్రహ్మం గారి మఠం వద్ద సత్సంగంలో స్వామి కృప కలిగితే **"అన్నీ వారే చూసుకుంటారు, మనను వారి ఇష్ట ప్రకారం నడిపిస్తారు, మన భాద్యత వారే వహిస్తారు"** అని చెప్పారు. లక్ష్మి గారు (దమ్మపేట) స్వామి కృప ఎలా కలుగుతుంది సార్? అని అడిగారు. **శ్రీ సార్ "మీరు నెల నెల గొలగమూడి రండమ్మా! స్వామి కృప కలుగుతుంది"** అని చెప్పారు. మొదటి నెల అలానే వచ్చారు. అప్పుడు అన్నశాలలో (బయట) తినడం వల్ల లక్ష్మి గారికి అనారోగ్యం అయింది. గొలగమూడి వచ్చినప్పుడల్లా బయట తినడం, ఇలా అనారోగ్యం కావడం అయితే ఇబ్బంది అని, 'ఇంక రాలేను సార్' అని చెప్పి సార్ కి లెటర్ రాశారు.

శ్రీ సార్ రిప్లై లో స్వామి సన్నిధిలో గడపడానికి బయట తినడం వల్ల ఇబ్బంది అయితే మీరు మా ఇంట్లో ని ఒక రూమ్ లో వంట చేసుకుని తింటూ స్వామి దర్శనము, సేవ చేసుకోవచ్చు. ఆ రూమ్ మీకే ఇచ్చేస్తాను. అలా చేయాలి కానీ స్వామి సన్నిధిని వదులుకోవద్దు అని చెప్పి రాశారు.

శ్రీ సార్ ఇంట్లోనే ఒక రూమ్ అప్పటినుండి భక్తులకి, స్వామిని దర్శించి వంట చేసుకొని సేవించుకునే భక్తులకు, అక్కడ వండుకుని ఉండేందుకై శ్రీ సార్ ఇచ్చి వేశారు. "నీ భక్తుల దాసుని కరుణించుము శ్రీహరి" అన్న రీతిలో శ్రీ సార్, భక్తులకు స్వామిని సేవించుకొనే అవకాశం కలిగించడం కోసం తన స్వంత ఖర్చుతో నిర్మించుకొన్న రూమ్ ను ఇవ్వటమే కాక ఆ రూమ్ లో గ్యాస్, వంటపాత్రలు మొ|| అవసరమైన వసతులు అన్నీ arrange చేసి సహకారం అందిచటం శ్రీ సార్ కే చెల్లింది. సార్ తాము చేసిన సేవకు ఏనాడూ ధన సహాయం ఆశించలేదు, అడగలేదు. సార్ మాత్రమే గాక సార్

కుటుంబసభ్యులు ఎవరికీ అలాంటి ఆలోచన సార్ భౌతికంగా ఉన్నప్పుడే గాక, సార్ సమాధి అయిన తర్వాత కూడా లేదు. వచ్చిన వాళ్ళు శ్రీ స్వామివారి సేవ చేసుకుని వెళితే శ్రీ సార్ ఎంతో తృప్తి పాడేవారు.

సాయి సుబ్రహ్మణ్యం తనకు శ్రీ సార్ కృప, సహాయం అనుభవమైన అనుభవాలలో కొన్ని ఇలా పంచు కొంటున్నాడు: PhD అయిపోయాక గొలగమూడిలో ఉండే ప్రేరణ శ్రీ సార్ సాయి కి పెట్టారు. అయితే సాయికి సార్ దగ్గరే, సార్ వాళ్ళ ఇంట్లోనే ఉండాలని ఉద్దేశ్యము (తప్పితే ఉండలేని భావన). సర్వజ్ఞులైన (పరేంగిత అవగాహి అయిన) శ్రీ సార్ ఆ విషయం చెప్పకనే గ్రహించి కనీసం ఏ విధమైన లౌకిక ఆలోచన లేక శ్రీసార్ పూజా మందిరం, ముందు రూమ్ కలుపుకొని, వెనకాల ఇంకొక రూమ్ నిర్మాణం చేసి మొత్తం మూడు ఒక పోర్షన్ గా సాయి నివాసానికి, పెళ్లి తర్వాత కూడా నివసించేందుకు వసతి కల్పించారు. మనం లౌకిక ఊహకు అందని విధంగా శ్రీ సార్ అక్కడ సాయి నివసించడానికి అంతటి నిర్మాణం చేసినా, సాయి నుంచి ఒక రూపాయి ఎప్పుడు ఆశించింది లేదు. సాయి కూడా నిర్మాణానికి అసలు ఇచ్చింది లేదు. తరువాత అచ్చటనే సాయి ఇంచుమించు రెండు సంవత్సరాలు ఉండడం జరిగింది. అన్ని రోజులలో కూడా సార్ ఎప్పుడు అడిగినది కానీ, డబ్బు విషయమై మాట్లాడింది కానీ లేదు. సాయి సార్ కు ఇచ్చేవి (దక్షిణ) సాయి మాస్టర్ నిలయంకు ఇచ్చేవారు. మనసులో ఉన్న భావం గ్రహించి చేయ గలగటం శ్రీ సార్ సర్వజ్ఞతను మన స్వంత వారు కుడా చేయలేని ఇట్టి సహాయం శ్రీ సార్ గురుసేవా తత్పరతను తెలుపుతున్నాయి.

శ్రీ సార్ 2001 నుండి అచ్చట నివాసం ఉంటున్నా నీళ్ళు బావిలో నుంచి తోడుకొని వాడుకొనే వారే. వారికై, వారి కుటుంబానికై కుడా బోర్ వేయించి, over head tank పెట్టించి ఎరుగరు. సాయి 2010 లో వివాహం అయ్యాక నివాసం ఉండటానికి రొజూ నీళ్ళు మోసుకు రావటం సాయి కుటుంబానికి కష్టము కాకుండా సాయి భార్య వచ్చే సమయానికే బోర్, over head tank (సులభంగా) పెట్టించి వంటింట్లో tap పెట్టి, అచ్చటకు నీరు వచ్చేలా చేసారు. అప్పుడే సార్ వాళ్ళ వంటింట్లోకి కూడా tap పెట్టుకోవడం జరిగింది. ఇది అర్ధం కావటానికి కానీ, ఇట్టి ఆచరణ రావటానికి కాని మనకు ఎన్ని జన్మలకైనా సాధ్యమేనా ? వైరాగ్యము, సాధు జీవనానికి తోడూ ఇంతటి దయ, కరుణ మనమెక్కడ చూడ గలము ?

సాయి గొలగమూడిలో ఉండేటప్పుడు ఒక సమయంలో శ్రీ సార్ వారి ఇంటి ఆవరణలో ఆరు బయట పడుకునేవారు. శ్రీ సార్ ప్రక్కన పడుకోవాలని సాయి ఆరాటంతో సార్ మంచం ప్రక్కన కింద పడుకున్నాడు. తర్వాత రోజుకు కుక్కలు మొదలగునవి వస్తాయని, సాయి పడుకోడానికి ఒక బెడ్ లాంటిది ఉంటే బాగుంటుందని నాపరాయితో సార్ ఒక బెడ్ (పాన్పు) నిర్మించి, ఈ రోజు నుంచి (సాయిని) దాని మీద పడుకోమన్నారు. అలా కొన్ని రోజులు సార్ సాంగత్యంలో నిద్రించే అవకాశం శ్రీ సారే కల్పించారు. **కన్నతండ్రి కూడా అంత త్వరగా ఆలోచించి సమకూర్చలేరు. అన్ని జీవుల్లో వెంకయ్య స్వామిని దర్శించటం శ్రీ సార్ ఆచరణలో అణువు అణువునా కనిపిస్తుంది.**

తర్వాత కొన్ని రోజుల కు సాయి మాస్టార్ నిలయంలో సేవకు ఎవరూ లేరు. అప్పుడు ఎవరైన రాత్రి వచ్చిన వారికి

సాయి మాస్టర్ నిలయం మూసి ఉండటం వల్ల ఇబ్బంది కలుగుతుందని శ్రీసార్ వారిలోని భగవంతుని సేవకై "సాయి మాస్టర్ నిలయం" బయట పడుకోవడం ప్రారంభించారు. "సాయిబాబా షిరిడీలో వసతులు లేని రోజుల్లో రాత్రి వచ్చినా సరే, భక్తులను ఒక లాంతరు తీసుకొని ఎదురుపడి "కౌన్ రే !" అనే పలకరింపు తో వారి సేవ చేసేవారు. తరువాత వారిని రాధాకృష్ణ ఆయీ ఇంటికి పంపేవారు. **ఇలా శ్రీ భరద్వాజ మాస్టర్ "సాయి మాస్టర్ నిలయం" కట్టించిన తర్వాత కూడా మనం అలా చేయకుంటే శ్రీ మాస్టారు పాత చెప్పుకు పేడ అద్ది కొడతారు" అని చెప్పేవారు.** శ్రీ సార్ తో వారి మంచం పక్కనే నిద్రించిన అవకాశం శ్రీ సాయి కి ఆ సమయంలో కూడా కల్పించారు.

సాయి ఫ్రాన్స్ వెళ్లి వచ్చిన తర్వాత గొలగమూడిలో ఉందామని అనుకున్నప్పుడు శిరీష చిన్నపిల్లలతో రావడం ఇబ్బంది అని అనుకుంటే, శ్రీ సార్ ఒక్కపూట లో మొదటి రూమ్ లో ఒక kitchin గట్టు, సామాన్లు పెట్టుకునే ఏర్పాటు చేశారు (చేయించారు). **ఇలా తనకంటూ, తనదంటూ ఏదీ లేకుండా ఏదీ ఆశించకుండా జీవితం అంతా గురుసేవ గా చేయడం శ్రీ సార్ కే చెల్లింది.** "పరోపకారార్థం ఇదం శరీరం" అని శ్రీ దర్గా స్వామి వారిచే కీర్తించబడిన శిష్య శ్రేష్ఠులు శ్రీ సార్.

హైదరాబాద్ లో ఉండి సార్ పుస్తకాలు అన్నీ ప్రింట్ చేయిస్తాడు వెంకటేశ్వర రావు. అది సార్ సేవగా భావిస్తాడు. ఒకసారి అతను గొలగమూడి వస్తే సార్ ఆనందంగా వెంకటేశ్వర రావు వచ్చాడంటూ భోజనానికి అరటిఆకు కోసుకురమ్మని ప్రసాద్ ను పురమాయించి అతనికి భోజనం వడ్డించారు. **సేవకుడు, భక్తుడైన వారి కోసం భగవంతుని ఆనందమెంతటిదో!**

**పాబోలు వెంకటేశ్వర్లు గారు కష్టాలలో ఉన్న తన కుటుంబాన్ని సార్ ఎలా ఆదుకుని రక్షించారో తెలుపుతున్నారు.**

మాది నెల్లూరు. మా అమ్మ, నాన్నకు ముగ్గురు పిల్లలం. ఇద్దరు అక్కలు, నేను. నేను చివరి వాడిని. నాకు 6 సంవత్సరాలకి మా నాన్నగారు చనిపోయారు. మా అమ్మ ఎంతో కష్టపడి మా ముగ్గురిని పెంచారు. మా అమ్మమ్మ సార్ వాళ్ళ అమ్మకి పిన్ని కూతురు. అలా నాకు సుబ్బరామయ్య సార్ మామ వరుస అవుతారు. మా అమ్మ అప్పుడప్పుడు నన్ను గొలగమూడి తీసుకు వెళ్ళేది. అప్పుడు సార్ తో పరిచయం చాలా తక్కువ. నా ప్రపంచం అంతా మా అమ్మ. ఎక్కడకన్నా వెళ్ళాలన్నా ఎవరన్నా మనిషి ఉండాలి లేదా మా అమ్మ ఉండాలి. ఒక్కడినే వెళ్ళటం చాలా అరుదుగా ఉండేది.

నాకు పెళ్ళయి మొదటి పిల్లవాడు పుట్టిన తర్వాత మా అమ్మగారికి ఒంట్లో బాగోలేదు. నెల్లూరు డాక్టర్లు చెప్పినట్లు వైద్యానికి చెన్నై (అప్పట్లో మద్రాస్) కి తీసుకు వెళ్ళేవాడిని. ప్రతి పదిహేను రోజులకి చెన్నై వెళితే 50 వేల రూపాయల పరీక్షలు చేసేవారు. నేను ఒక్కడినే ఉండటం వలన అన్నీ నేను చూసుకోవాల్సి వచ్చేది. అంతేగాక ఒక్కొక్క సారి నిద్ర ఉండేది కాదు. కొన్ని కారణాల వల్ల నా అక్కల నుండి, నా భార్య నుండి ఏ మాత్రం సహాయం అందేది కాదు. మా అమ్మకి, నా భార్య మధ్య సయోధ్య లేదు. అందువలన నేను ఒక్కడినే మా అమ్మగారికి సేవ చేసేవాడిని. అలాంటి సమయంలో సార్ దగ్గరకి వారానికి ఒకసారి మా అమ్మను ఇద్దరి మనుష్యుల సహాయంతో తీసుకు వెళ్ళేవాడిని. సార్ ఒకసారి నా ముందర మా అమ్మగారి గురించి చెపుతూ "వాడికి నమ్మకముంటే గొలగమూడి తీసుకు వచ్చి ఉండమన్నారు". మా అమ్మ ఆరోగ్య పరిస్థితి బాగా విషమించింది. మద్రాసు డాక్టర్లు కామెర్లకు బదులు టి.బి.కి మందు ఇచ్చారు. మా అమ్మకు పక్షవాతం వచ్చింది. సుమారు 10 లక్షల రూపాయల దాకా అప్పు

అయ్యింది. దిక్కు తెలియక స్థితిలో నేను సార్ ని ఆశ్రయించాను. సార్ మద్రాస్ డాక్టర్ల మందు ఆపించి, మా అమ్మకు పచ్చ కామెర్లకు నాటు వైద్యం చేయించారు. చాల కొద్ది కాలంలో (రెండు వారాల లోపు) మా అమ్మకు ఆరోగ్యం బాగుపడింది (పక్షవాతం కూడా తగ్గింది). మా అమ్మ తనంత తానే వాకర్ సహాయంతో నడుచుకుంటూ స్వామి దర్శనం చేసుకో గలిగేది. స్వామి దర్శనం అయిన తరువాత సార్ దగ్గరకి వెళ్ళేది. స్వామి అన్నశాల ప్రక్కన ఉన్న రోడ్డులో ఉన్న కట్టెల వెంకయ్య గారి ఇంట్లో అద్దెకున్నాము. రాత్రి పూట చీకటిగా ఉండటం వల్ల ఎక్కువ మంది ఉచ్చలు పోసేవారు. అలా మా అమ్మ స్వామి దర్శనానికి వెళుతుంటే చూసారు. తర్వాత రోజు మట్టి తెప్పించి ఆ ఉచ్చలు పోసినంత వరకు నా చేత వేయించి మా అమ్మ స్వామి దర్శనానికి ఇబ్బంది లేకుండా చేసారు.

ఎవరన్నా బంధువులు వచ్చి మా అమ్మను గొలగమూడి నుండి తీసుకు వెళతారని సార్ నన్ను మా బంధువులు ఎవరికీ ఎక్కడ ఉన్నానో చెప్పవద్దన్నారు. మా అక్క వాళ్ళు, మిగిలిన బంధువులు ఎన్నోసార్లు నన్ను వెతకటానికి గొలగమూడి వస్తే ఏనాడూ మేము వారికి కనపడలేదు. అంత చిన్న గ్రామంలో ఒకరికి ఒకరం కనపడకుండా ఉండటం స్వామి కృప కాకపోతే ఏమిటి? ఒకసారి నా ఫ్రెండ్ నన్ను గొలగమూడిలో చూస్తే సార్ అతనికి దండం పెట్టి ఆ విషయం ఎవరికీ చెప్పవద్దన్నారు. అంటే స్వామి దగ్గర ఉంటే ఆరోగ్యం బాగుపడుతుందని సార్ కి ఎంత నమ్మకమో! దాని కోసం చిన్న వయస్సులో ఉన్నవాడిని కూడా అభ్యర్థించటంలో సార్ సాధారణత్వము అర్ధమౌతోంది.

కొన్ని నెలల తర్వాత మా అమ్మ పత్యం ఉండక పోవడంతో ఆరోగ్యం క్షీణించి కొన్ని నెలల తర్వాత చనిపోయింది. మా బంధువులందరూ "అరేయ్! ఆమె కార్యక్రమానికి మంచి భోజనం (కాటేరర్స్ కి ఆర్డర్ ఇచ్చి) పెట్టించి ఆమెకు తృప్తిని కలిగించు" అని అందరూ అన్నారు.

ఎంతమంది వస్తారో తెలియదు, కేటరింగ్ అంటే ఎక్కువ డబ్బులు అవుతాయి. ఏమి చేయాలో తెలియక సార్ కి ఈ విషయం చెపితే సార్ “ఆ విషయం నాకు ఒదిలెయ్! నేను చూసుకుంటాను అని చెప్పారు”. 13వ రోజున కార్యక్రమంలో భోజనం తిన్న వారందరూ “ఇది ఏ హోటల్ నుండి తెప్పించారు. చాలా బాగుంది” అని చెప్పారు. సార్ మాట ఇచ్చారు అంటే ఆ మాటను నెరవేరుస్తారు.

మా అమ్మ పడే బాధను చూసి చాలా బాధ పడేవాడిని. అన్ని విషయాలు సార్, అమ్మగారితో చెప్పుకునేవాడిని. సార్ “అరేయ్ దారిలో వెళుతూ ఉంటాము, ఉన్నట్టుండి వర్షం కురుస్తుంది.....అప్పుడేమౌతుంది తడిసిపోతాము...వర్షం తగ్గిన తర్వాత మరలా మన ప్రయాణం జరుగుతుంది కదా! ఇది కూడా అంతే” అని ఓదార్చేవారు. మా అమ్మ మరణించాక మైలతో ఉన్నప్పుడు సార్ ఇంట్లోకి రానిచ్చారు. మా అమ్మ కర్మలకు సార్ ఆర్థిక, కాయిక సాయం కూడా అందించారు.

సార్ నన్ను గొలగమూడికి రప్పించటమే కాకుండా నా బ్రతుకు తెరువు కోసం షాప్ కూడా పెట్టించారు. ఆ షాప్ ఎక్కడ పెట్టాలో స్వామి దగ్గర చీట్లు పెట్టించి దాని ప్రకారం నడిపించారు. షాప్ పెట్టటానికి డోర్ తయారుచేయించటానికి వండ్రంగిని పిలుద్దామనుకుంటే సార్ నాతో “నువ్వు చేయలేవా?” అని అడిగారు. అందుకు ప్రయత్నించి నా అంతటా నేను డోర్ తయారు చేశాను. సార్ చెప్పినట్లు చేయటం వల్ల నాకు తృప్తిగా ఉంది. అంతేగాకుండా రకరకాల పనులు చేయటం వచ్చింది.

ఈ రోజు మేము హాయిగా తృప్తిగా ఉన్నాము అంటే సార్ కృపే!

నా భార్యకి నేను ఎక్కువ మా అమ్మ దగ్గర ఉంటున్నానని, లేకపోతే సార్ దగ్గర ఏదో ఒక పని చేస్తూ ఇంట్లో ఉండనని సార్ అంటే కోపం. అందువలన సార్ ని అనవసరమైన మాటలు మాట్లాడేది. సార్ కి చెప్పి బాధ పడితే ఓర్పు గా ఉండమనేవారు. అలానే ఉన్నాను. సార్ సమాధి అయిన తర్వాత

మా అత్తగారికి, నా భార్యకి సార్ సమాధి దగ్గర ఆరతులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా వెళితే హాయిగా ఉంటుంది. ఎంతో వ్యతిరేకంగా ఉన్న మా వాళ్ళ మనస్సుల లో స్వామిపై సార్ పై విశ్వాసం భక్తి చిగురింపచేయటం, వారి సేవ చేయించుకొనుటకు మరల్చటం వారి దివ్య కృప కాక మరేమిటి ? కృతజ్ఞతతో స్వామి అండలో ఎప్పుడు జీవించాలని కోరుకుంటున్నాము. ఆశ్రితులకు అడుగకనే సర్వము ప్రసాదింప బడటం ఎందరికో శ్రీ సార్ సాంగత్యంలో చూడవచ్చు.

## 5-09-2017, నగేష్, బెంగుళూరు ఇలా చెబుతున్నారు:

మొదటిలో సర్ లెటర్స్ రాస్తూ ఒక్కరితో అయినా సరే సత్సంగం చెయ్యమని చెప్పారు. బయట ఎక్కడా ఎవరు వండినవి తినవద్దు నువ్వే వండుకుని తిను అన్నారు. ఇక్కడి వెంకయ్య స్వామే అక్కడ (ఢిల్లీ) నిజాముద్దీన్ రూపంలో ఉన్నారు అని చెప్పి దర్శించమన్నారు. సందేహాలకి లెటర్స్ ద్వారా సమాధానం చెప్పేవారు. సాయిబాబా సమాధిని, ఏదైనా దేవుని విగ్రహాన్ని గాని పుజించగలం, నమ్మగలం. కాని, మామూలుగా కనిపించే, మాట్లాడే మనిషిని దేవుడిగా నమ్మటం, దివ్యత్వం గమనించడం ఎలా? ఇప్పట్లో ఎంతోమంది నకిలీ GODMAN లు ఉన్నారు కదా!

సార్ పై నా నమ్మకం - ప్రార్ధన, దానికి నిదర్శనం, అప్పుడు కొంచెం నమ్మకం, కొంచెం అనుమానం, మళ్ళీ టెస్ట్ చెయ్యటం, మళ్ళీ నిదర్శనం, మళ్ళీ నమ్మకం, మళ్ళీ ప్రార్ధన... ఇలా STEP BY STEP జరిగింది. ఒక్కసారిగా జరగలేదు. అంత పుణ్యం లేదు కదా.

సార్ నాకు ఢిల్లీలో ఉన్నపుడు నిజాముద్దీన్ దర్గాని నియమపూర్వకంగా ఒకే టైంలో దర్శించమని చెప్పారు. అప్పటికి సార్ పై ఏ నమ్మకం లేదు. కాని చెప్పింది చేయాలి అనిపించి

చేస్తుండగా, ఒకసారి ఉద్యోగం, ఇల్లు రెండూ మారటానికి దేవుడి నుంచి సమాధానం కావాలి అని గురుచరిత్ర పారాయణ చేస్తున్నాను. పారాయణ మూడవరోజు నిజాముద్దీన్ దర్గా నుంచి వస్తుండగా మనసులో చాల ధృడంగా దేవుడి నుంచి ముడురోజుల్లో సమాధానం రావాలి అని అనుకుంటూ మళ్ళీ వెంటనే, మూడు రోజులెందుకు, ఏం? ఈరోజు ఇవ్వలేడా అని చాలా తీవ్రంగా అనుకున్నాను. రెండు గంటల్లో ప్రసాద్ నుంచి ఫోన్ వచ్చి 'సర్ నిన్ను జాబ్ RESIGN చేయ్యమంటున్నారు' అని సార్ తో మాట్లాడమంటే సార్ "నగేష్! నీకు జీతం ఎంతిస్తున్నారు? ఏం, ఆ డబ్బులు ఇక్కడ సంపాదించ లేవా" అని ఇంకా చెప్పారు. ఢిల్లీలో, మనసులోని నా ప్రార్ధన సార్ కి ఎలా తెలిసింది?

ఇక్కడి నుంచి సార్ మనలా మామూలు మనిషి కాదు అని నిరూపణ అయింది.

నా గురువు ఎవ్వరో తెలియపరచమని దేవుడికి ప్రార్ధించి గురుచరిత్ర పారాయణ చేశాను. సర్, కలలో కనిపించారు. కలలో సార్ పొట్టపై నా తల ఉంచాను, మంత్రాలు వినిపిస్తున్నాయి. నేను ఒక మంత్రం చెప్తే సార్ అవును అన్నారు. సార్ తో ఈ విషయం చెప్పాను. సార్, చిరునవ్వు నవ్వారు. ఇంక నా గురువు సారే అని అర్ధమయింది.

ఏ పని ఐనా సరే మొదలు పెట్టడానికి ముందు సార్ కి చెప్పి స్టార్ట్ చెయ్యడం అలవాటు అయిపోయింది. ఒక విధంగా సార్ తనకు తనే PROOFS ఇచ్చి విశ్వాసం కల్పించారు. చాలా సార్లు నేను సార్ ని మనసులో టెస్ట్ చేసేవాడిని.. అది నా విశ్వాసానికి కూడా టెస్ట్. సార్ దగ్గర నుంచి ఆదివారం రాత్రి బయలుదేరి బెంగళూరు బస్సు పట్టుకోవాలి. గొలగమూడి లో రాత్రి 8.30 తరువాత ఆటోలు దొరకటం కష్టం. కాని నాకు పది గంటలు దాటినా సరే ఎదో ఒకలా వెహికల్స్ దొరికేవి. అవి చెప్తే ఒక పుస్తకమే అవుతుంది. సార్ కి ఒక సందర్భంలో ఆవిషయం

చెప్తే లేటుగా బయలుదేరి వెంకయ్యస్వామికి ఇబ్బంది పెట్టకూడదు అన్నారు. అంటే స్వామి నాకోసం వెహికల్స్ ఉంచుతున్నారు అని చెప్పటమే కదా ....!

GENPACT కంపెనీలో పని చేస్తుండగా ఐఐఎం కోర్స్ ఒకటి చేద్దామని సార్ ను అడిగేతే సార్ జాయిన్ అవమన్నారు. కానీ ఎంత చిత్రమో! ఫైనల్ ఎగ్జామ్స్ డేట్స్ కూడా మర్చిపోయాను!! అంతకు ముందు రెండు వారాలు నుంచి నువ్వు చదవటం లేదు అని సార్ అంటున్నారు. నేను ఇప్పుడేం చదవాలి అనుకుంటున్నాను కాని ఎగ్జామ్స్ గురించి పూర్తిగా మర్చిపోయాను. తరువాత శనివారం ఉదయం సార్ నన్ను గుడి మూసినంత వరకు ప్రదక్షిణలు చెయ్యమన్నారు. హ్యాపీగా వెళ్లి మొదలు పెట్టాను. మధ్యాహ్నం ముయ్యలేదు, రాత్రి కూడా ముయ్యలేదు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకి మూసారు. (అప్పట్లో శనివారం గుడి మూసేవారు కాడు. ఆ విషయం నాకు తెలియదు). ప్రదక్షిణలు కంప్లీట్ చేసి సార్ దగ్గరకు వచ్చాను. మరుచటి రోజు ఉదయం ఆఫీస్ ఫ్రెండ్ నుంచి ఫోన్ వచ్చింది. అతను 'నగేష్ HOW IS THE PREPEATION? ARE YOU READY FOR THE EXAM?' అని. అంతే నాకు మైండ్ బ్లాంక్ ఐపోయింది. కొన్ని వారాలునుంచి వెతుకుతున్న కోర్స్ MATERIAL వెనువెంటనే దొరికింది. ఆఫీసుకి చేరేలోపు రెండు గంటలు చదివాను. ABOVE AVERAGE గ్రేడ్ తో ఎగ్జామ్స్ పాస్ అయ్యాను. నేనే మర్చిపోయిన పరీక్షలు సార్ హెచ్చరించి చదవమనడం, అలా చెప్పిన తర్వాత కూడా నాకు గుర్తు రాకపోతే సార్ దీక్ష చేయించి నన్ను పాస్ చేయించడం సార్ అనుగ్రహం కాదా?

అసలు నాకు జాబ్ రావటమే సార్ అనుగ్రహం. ఎలా అంటే, బెంగుళూరు వచ్చిన తరువాత GENPACT లో 6 నెలలు ఐనా HRరౌండ్ కాలేదు. హోల్డ్ లో పెట్టేసారు. సార్ సడన్ గా ఫోన్ చేసి నగేష్, నువ్వు గొలగమూడి రానక్కరలేదు,

దగ్గరగా ఉండే గుడిలో ద్రవాహారం తీసుకుని ఉదయం నుంచి రాత్రి వరకు ప్రదక్షిణలు చెయ్యి అన్నారు. నువ్వు జాబ్ రావాలి అని కోరుకోవాలి. కోరుకోక పొతే ఎలా? అన్నారు. ఇంకా... "**నువ్వు అక్కడ ఎలా ప్రదక్షిణలు చేస్తావో నేను ఇక్కడ (గొలగమూడి) నుంచి చూస్తుంటాను**" అన్నారు. నాకింక చాలా ఆనందం వేసింది. చెప్పింది (ప్రదక్షిణలు) చెయ్యటం నాపని – నాబాధ్యత శ్రీ సార్ పని. నేనింక టెన్షన్ పడక్కరలేదు. అనుకుని ఒక రోజు అలా అతికష్టం మీద కూర్చోకుండా ఉదయం నుంచి రాత్రి గుడి మూసినంత వరకు కంప్లీట్ చేశాను. సార్ కి ఫోన్ చేసి చెప్తే ఒక రోజు గ్యాప్ తీసుకుని మళ్ళీ ఇంకో రోజు చెయ్యమన్నారు. అలానే చేసి ఫోన్ చేసి చెప్పాను. అప్పుడు సార్ కొంచెం కోపంగా, ఒక రోజు చేస్తాను, రెండు రోజులు చేస్తాను అని కాదు, జాబ్ వచ్చినంత వరకు రోజు మార్చి రోజు అలానే చెయ్యాలి అన్నారు. సార్ అంత ప్రేమతో చెప్పేసరికి నేనన్నాను "సార్! నాకు వెంకయ్యస్వామి, భరద్వాజ మాస్టర్ ఎంచేసారో తెలియదు కాని మీరు మాత్రం చాలా చేస్తున్నారు అన్నాను. సార్, "సుబ్బరాయుడు, భరద్వాజ మాస్టారు, వెంకయ్యస్వామి, వేరు కాదు ఒకే దివ్య చైతన్యం, అన్నీ వేరుగా లేవు" అన్నారు. సార్ ఒక్కసారి అంత డైరెక్ట్ గా చెప్పేసరికి ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి – ఎందుకంటే సార్, అసలు ఎవ్వరు వచ్చినా నేనేం చేస్తాను, నేనేమైనా దేవుడినా? వెంకయ్య స్వామికి చెప్పుకోండి అంటారు.

ఇంక non-stop ప్రదక్షిణలు నేను మొదలుపెట్టాను (మధ్యలో బ్రేక్ ఉండకూడదు కాబట్టి 1 or 2 చిన్న పెరుగు పేకట్ లు నా ఫుడ్. తరువాత తెలిసింది నేను 48kg లు అయ్యాను అని). కేవలం 7 or 8 వ రోజు ప్రదక్షిణాలు చేస్తుండగా కంపెనీ నుంచి ఫోన్ వచ్చింది. Congratulations Nagesh! You are selected as Business analyst అని. ఇది పూర్తిగా సార్ కృపే. ఏమాత్రం నా తెలివితేటలు, అర్హతల

వల్ల కానేకాదు. వీటన్నిటిలో సార్ సర్వవ్యాపకత్వం, సర్వసమర్ధత్వం క్లియర్ గా కనిపిస్తున్నాయి.

స్వామి భక్తులు కూర తరగటం, కుక్కర్ పెట్టడం మొ|| పనులు చేస్తూ కూర తొక్కు వదిలేసి సేవకు బయల్దేరినప్పుడు సార్ ఆ రూమ్ లో కూర తుక్కు చూసి ఎత్తి వేసేవారు. కనీసం వారికి చెప్పను కూడా చెప్పరు. తర్వాత ఎప్పుడో వారికి అది ఎరుక లోకి వచ్చేది. “అన్ని జీవుల్లో వెంకయ్య స్వామిని దర్శిస్తూ సేవించటం” ఇంతగా నరనరాలలో జీర్ణించుకుని, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురుసేవలతో పునీతులై మన మధ్య చరించిన శ్రీ సార్ స్మరణ నిస్సంశయంగా అత్యంత ఆనందకరము, పాపనాశకము!

ప్రసాద్ కి ఒక ప్రమాదం తప్పినప్పుడు దడుపు జ్వరం వస్తే సార్ మందు ఇప్పించి, పత్యం కూడా సారే స్వయంగా చేసి పెట్టి స్వస్థుడిని చేశారు.

హైమావతి (అమ్మలు) పెళ్లి చేసుకుని తన భర్తతో కలసి గొలగమూడి వచ్చి సార్ దర్శనం చేసుకుంటే ఆ దంపతులకు సార్ స్వయంగా వంట చేసి పెట్టారు. అంతేగాకుండా వారిద్దరూ భోజనం చేస్తున్నప్పుడు సార్ వారి ప్రక్కనే కూర్చుని కబుర్లు చెపుతూ కూర్చున్నారు. ఎంతటి అదృష్టమో! ఆ దేవ దేవుడే ప్రక్కన కూర్చోవటమూ, స్వయంగా ప్రసాదం ఇవ్వటమంటే!!

”నీ భక్తుల దాసుని కరుణించుము శ్రీ హరీ!” అన్న ఆరతి పాటకు శ్రీ సార్ ఆచరణ ప్రత్యక్ష దర్పణం.

సాయి మాస్టర్ నిలయంలో ఉండే ఆడ కుక్క కడుపుతో ఉంటే సార్ ప్రతిరోజూ ఆ కుక్కకు పంచదార కలిపిన ఉత్త అన్నం పెట్టేవారు.

ఒక భక్తుడు “ఏది చేస్తే నిష్కామ కర్మ అవుతుంది” అని ప్రశ్నించగా శ్రీ సార్ “నిష్క్కమ కర్మకు ఒక లిస్టు అంటూ లేదు !” అని చెప్పారు. **అయితే చేసే ప్రతి పని నిష్కామ కర్మగా చేయటం పై సంఘటనలోని శ్రీ సార్ ఆచరణలో చూడ వచ్చు.**

సాయిలక్ష్మి, పోలియో పిల్లాడు, సీతారామయ్య గారు మొదలుకుని, ఎప్పుడూ వస్తూ ఉండే సాయి, లక్ష్మక్క, శివరత్నం, ప్రసాద్, నగేష్ వంటి ఆశ్రితులను, సద్గురు రూపంగా ఎంతో ప్రేమతో వారి కష్టకాలంలో విపరీత పరిస్థితులను కూడా ఎదుర్కొని ఆశ్రయమివ్వడం శ్రీ సార్‌కే చెల్లింది. వారి గురువుపై వారు వహించిన శ్రద్ధకు గీటురాయిగా నిలిచింది. ఆదరించిన వారు రాగద్వేషాలలో చిక్కుకుని వ్యవహరించినా, వారి వల్ల నిందలు, ఎందరో వ్యక్తుల, సమాజం వ్యతిరిక్తత ఎదురైనా, శ్రీ స్వామికి వారు వహించిన శరణాగతితో ఆశ్రితులను ఉద్ధరించటం, వారికి స్వామి కృప కల్గేలా చేయడం, శ్రీ సార్‌కే చెల్లింది. **శ్రీ సార్ జీవనమే "అన్ని రూపాల్లో వెంకయ్య ఉన్నారని వ్రాసుకోయ్యా" అన్న శ్రీ స్వామివారి మాటకు ఆచరణాత్మక బోధ, రాగద్వేషాలు తాకని గురు సేవ అనేది మనం హృదయగతం చేసుకుని వారి కృప పొందేలా నడిపించమని ప్రార్థిద్దాం.**

# శ్రీ సార్ లెటర్లు

***చేసే ప్రతిపని నిష్కామ కర్మగా చేస్తూ నిరంతర గురు సేవలో జీవించిన శ్రీ సార్ కలం నుండి వెలువడిన ప్రతి వాక్యము, మనకు ఆచరణ సౌలభ్యాన్నిచ్చే పరమ పద సోపానము అని ఈ క్రింది లెటర్లలో గుర్తించ గలము:***

22-09-2000 న శ్రీ పసుమర్తి రాఘువులు గారికి : వానప్రస్త ఆశ్రమ ధర్మమూ, ఆత్మోన్నతికి శ్రీ సార్ సలహా

గొలగమూడి
22-09-2000

పూజ్యశ్రీ గురు బంధువులైన శ్రీ పసుమర్తి రాఘువులు గారికి పె. సుబ్బరామయ్య నమస్కారములు.

సార్! మా టేప్ రికార్డులో రికార్డింగ్ చేయడం లేదు. ఏదో శబ్దాలు వస్తాయి. యుగంధర్ టేప్ రికార్డర్ చెడి మూల పెట్టాడు. ఇప్పుడల్లా రిపేరు చేయించలేడు. ఆర్థిక మాంద్యం అలా ఉంది. రాజు టేప్ రికార్డర్ చిన్నదైనా చాలా బాగా పనిచేసింది. మీరు వచ్చినప్పుడు ఆ టేప్ రికార్డర్ తీసుకొచ్చి రెండు రోజులు ఉండేటట్లు వస్తే పని పూర్తవుతుంది.

పిల్లలందరి బాధ్యతలు తీరినా మీకు పరుగులు తప్పడం లేదు. ఈ జన్మకు మీరు బయటపడుతారనేది లేనట్లుంది. ఉన్నది పెట్టుకొని తింటూ శ్రీ స్వామి వారిని సేవిస్తూ ఇక్కడే ఉంటే ఎంత బాగుంటుంది. బాగులేకుంటే ఎవరు చూస్తారు అని అడుగ బోతారు. ఇక్కడుండే వాళ్ళందరకి మీలాగ ఆస్తిపాస్తులు, కొడుకులు, కోడళ్ళు, మనవళ్ళు ఉన్నారా? వీళ్ళందరూ ఉంటే కూడా నాగమణి గారికి ఆరోగ్యం చేకూర్చలేకపోయారు. ఈ సత్సంగాలు, సాయి పూజలు నోములు అన్నీ దేనికి? లౌకిక బంధాలు అనబడే ఉచ్చులు తెంచుకొని కల్పవృక్షం నీడ

చేరడానికేనని బాగా గుర్తించండి. ఈనాడు నేను ఉద్యోగంలో ఉంటే నెలకు 14 వేలు. అదెందుకు వదులుకున్నానో మీరు గుర్తించండి. ఇక్కడ school పెట్టి సంపాదించవచ్చు కదా? జీవితాంతం సంపాదించుకోవడమే సరిపోయి ఇక వచ్చిన పని చేసుకునేదెప్పుడు. శ్రీ వెంకయ్య స్వామి దగ్గర కొచ్చి కాలమంతా ప్లాస్టిక్ అంగళ్ళు, హోటళ్ళు చూడడంలో ఖర్చు పెట్టినట్లుంది. మన ప్రయత్నం లేకుండా అంతా ఆయన చేస్తాడనేది వట్టిది.

"ప్రయత్నాద్యతమానస్తు యోగీసంశుద్ధ కిల్మిష:" అంటారు గీతలో, ప్రయత్నంతో సాధించు అని.

స్వప్నాల గూర్చి గొప్పగా పట్టించుకోవద్దు. మేమేమి చేయాలో బలవంతాన్నైనా మాచేత చేయించండి. మీరు సర్వభూత హృదయాంతెర్వర్తులు, సర్వ ప్రేరణాధికారులు గదా అని ఆర్తితో మొరపెట్టండి. స్వప్నాలు మాకు అర్థం కాలేదని చెప్పండి. స్వప్నాల అర్థం కాలం తెలుపుతుందనేవారు శ్రీ మాష్టారు. మీకై మీరే యోచించుకొంటే మీకే తెలుస్తుంది.

అందరమూ క్షేమం - సత్సంగం స్వామి కృపవల్ల బాగానే నడుస్తుంది. "సద్గురు వాణి" అనే పత్రికలు విశాఖపట్నం నుండి వచ్చాయా లేకుంటే నాకు రాయండి. సాధ్యమైనంత మంది చేత కట్టించండి.

నమస్కారములతో

పె. సుబ్బరామయ్య

******* సద్గురు దేవా శరణం శరణం *******

29-12-1997 న శ్రీమతి పసుమర్తి నాగమణి గారికి, భవానీ గారికి : మన మనస్సు బాగుండక పోయేందుకు కారణము

గొలగమూడి

29-12-1997

శ్రీమతి పసుమర్తి నాగమణి గారికి, భవానీ గారికి పెసల సుబ్బరామయ్య శ్రీ స్వామి వారి ఆశీస్సులు తెలియచేస్తూ వ్రాయడం. మీ లెటర్ చేరింది. కొన్ని అనివార్య కారణముల వలన వెంటనే లెటర్ వ్రాయలేక పోయాను.

1. మా ఆడవాళ్ళ తల్లి గారు ఈ మధ్య 18-12-1997 న గొలగమూడిలో స్వర్గస్తులైనది. ఆమెకు షుగరు వ్యాధి. 6 నెలల నుండి ఆస్పత్రి లో ఉంది – చివరకు గొలగమూడిలో తనువు చాలించాలని పట్టుదలగా వచ్చింది. 1-12-1997 నుండి చివరి క్షణం వరకు ఇక్కడే ఉండినది.

2. ఒక మిత్రునకు కొన్ని పరిస్థితుల కారణంగా వారి డబ్బుతో నేనే దగ్గరుండి గొలగమూడిలో 3 అంకణముల రేకులిల్లు వేయించవలసి వచ్చింది.

పై కారణములుగా వెంటనే వ్రాయలేక పోయాను.

మన మనస్సు బాగుండక పోయేందుకు ఒక్కటే కారణము. అది బాగా వంట పడితే ఇక తిరుగులేని రామ బాణంగా మన మనస్సు నిరంతరము సాయిచెంత ఉంటుంది. అదేమిటంటే - మాష్టరుగారు అంటారు - “సాయి నిరంతరం మనవైపు చూస్తుంటే మనమెక్కడో ఆలోచిస్తూ పరధ్యానంలో ఉండడం అపచారం గదా?”. ఈ కఠోరసత్యం వంటపడితే ఇక చీకు చింతలకు తావేలేదు.

మాష్టరుగారు మరొక మాట అంటారు. "నీవు నిరంతరం మృత్యువుకు దగ్గరవుతున్నావని ఎప్పుడైనా గుర్తించావా?" అనేవారు. ఈ రెండు విషయాలు వంటబడితే ఇక ఆ పైన చింతకు తావే లేదు.

మీ కుమారుని యాక్సిడెంట్ అప్పుడు మీరు గాని, మీ కుమారుడు గాని, ఆ క్షణంలో సాయిని పిలవలేదు గదా? వారే మనను ఆదుకొన్నారు. అంటే వారు నిరంతరం మనవైపు చూస్తున్నారన్నమాట. మనమే ఆయన వైపు చూడకుండా వేరే

అనవసరమైన ఆలోచనలలో ఉన్నామన్నమాట. మన ఆలోచనల వలన ఏమి ఒరుగుతుంది? కాలం వృధా అవడం తప్ప ఏమీ లేదు. మీ కుప్ప తగులపెట్టేటప్పుడు కూడా సాయి చూస్తూనే ఉన్నాడు. కానీ దాన్ని ఆపలేదు. అది మన మంచికే అలా జరుగనిచ్చారు. ఆ పని చేసిన వారిపై ద్వేషభావం వహించడం, కొందరిని అనుమానించడం అంతా కూడా సాయిని మరచి మన ప్రయత్నంలో ఉండడమే అవుతుంది. "అది మన మంచికే సాయి జరిపారు" అనేదొక్కటే మనకు శ్రేయోదాయకం. 25 సవర్ల బంగారం మా సొమ్ము మా మామగారింట్లో ఉంచితే దొంగొలెత్తుకు పోయారు. వారిది కూడా తీసుకు పోయారు. నాకేమీ అనిపించలా. సగం శని పోయింది. జీవితాంతం వాటిని మనమెక్కడ సంరక్షించగలము అనిపించింది. గనుక మీరు మనసు పాడుచేసుకోవద్దు. ఆ వడ్లు పోతే మనకేమైంది. మనమేమైనా పేదవారి మైనామా? మృత్యువుకు దగ్గర కాకుండా పోయామా? మనసు పాడుచేసుకోకు. మన శ్వాసలు సాయి పరం చేసే పని మానివేస్తున్నాము. ఆయన నిరంతరం మనవైపు చూస్తున్నాడు అనే విషయం మరచిపోతున్నాము. ఆ ఎరుకతో జీవించ ప్రయత్నించాలి. అదే ఆనందానికి మార్గం. అన్య చింతలన్నీ "చేతో గచ్ఛతి పీనతాం" అవుతాయి. సాధనంతా మనో నాశనానికయితే ఇలాంటి భావాల వలన మనస్సు పెరుగుతుందట. ఇచ్చిన ఈ సదవకాశం సద్వినియోగం చేసుకుందాం. పిడకలేరుకొనే పనికి స్వస్తి చెబుదాం. సాయినాధుని అనంత కరుణారసాన్ని మననం చేసుకుందాం. మృత్యువుకు దగ్గరవుతున్న విషయం అనుక్షణం గుర్తుంచుకుందాం. సత్సంగీయులందరినీ అడిగినట్లు చెప్ప ప్రార్థన.

నమస్తే

పె. సుబ్బరామయ్య

******* సద్గురు దేవా శరణం శరణం *******

11-6-2002 న సాయికి : శ్రీ సార్ అనంతపదసేవ

గొలగమూడి,

11-6-2002

చిరంజీవి సాయి సుబ్రహ్మణ్యం గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం. WORK ALLOT చేశారని వినినందుకు చాలా సంతోషం. మాస్టారు గారు అంటారు - చేసే వాళ్లను చూస్తే బాబా ఇంకా పనులు ఇస్తూనే ఉంటారు. అయితే మనం దానిని ఒక చాలెంజుగా తీసుకొని బాబా మెప్పు పొందేంతగా చేయాలి. పనిని చూసి విడవకూడదు. అదే బాబా సేవ, అంతేగాని కర్పూర హారతులు మాత్రమే కాదు అని చెప్పేవారు. విద్యానగర్ మందిర నిర్మాణమప్పుడు పవళింపు హారతికై పోగలిగేవాడిని. ఉదయం వేకువజామున నుండి క్యూరింగ్ నీరు పోయాలి. 10 గంటల తరువాత కూలీలకు, పిల్లలకు అన్నం కూర సిద్ధం చేయాలి. కనీసం 3 సార్లు 3*4 kg వండాలి. పెద్ద అండా లేదు. అన్నాలు తిన్నాక బొచ్చలు తోముకోవాలి. 3 గంటల నుండి 5 గంటల వరకు CURING కు నీరు – 5 గంటల తర్వాత మరలా వంట పని వడ్డింపులు ఇక హారతుల కెప్పుడు హాజరయ్యేది. ఆ మహానుభావుడు ఎందుకో గాని నన్ను మాత్రం హారతులకు రావడం లేదేమి? అని అడగలేదు. పనిలో INVOLVE అయ్యాక తీరిక లేదు. ఆయన పని అనే పరిశుద్ధమైన ఎరుకతో చేయి. PROJECT WORK కష్టమని ఎప్పుడు తలవవద్దు. అదే వారి సేవ అని ద్విగుణీకృతమైన ఉత్సాహంతో వారికి నమస్కరించి చేస్తూ ఉండు. ఆయనే నడిపిస్తాడు. అందరికంటే గొప్పగా వారి కృప పొందాలన్న ఒక్క ధ్యేయం ఉంటే వ్యామోహాలు, జిహ్వాచాపల్యాలు అన్నీ పోతాయి. ఇష్టమున్నా, లేకున్నా, తప్పుగా నైనా, సంక్షిప్తంగానైనా పూజ, పారాయణ, ప్రార్థనలు మానకుండా చేస్తుండు. EXERCISE REGULAR గా చెయ్యి.

JUST TO KEEP UP YOUR BODY IN TUNE WITH YOUR WORK. తాత గారు చెప్పినవన్నీ అవసరం లేదు.
శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా మీ కుండాలని ప్రార్థిస్తూ,

పెసల సుబ్బరామయ్య.

******* సద్గురు దేవా శరణం శరణం *******

30-04-2002 న Sai కి : స్వామి సన్నిధి - కైవల్యము

ఓం

గొలగమూడి, 30-04-2002

Dear Sai !

చనువుతో ఇలా వ్రాసినందుకు అన్యధా భావించవనుకుంటాను. "ఈ రోజే వ్రాసిన ఉత్తరం అందినట్లు తలచెదను" అని వ్రాసావు. ఇంకా అందలేదు. సరే కొత్త అడ్రసు చిక్కింది, ఇక నీవు వ్రాయకపోయినా నేను వ్రాస్తుంటాను. Project and Job etc., deal చేసేటప్పుడు జాగ్రత్తగా లౌకికం మనసులో ఎక్కకుండా చూచుకో. ముఖ్యంగా ఇతరులను విమర్శించడం, విమర్శిస్తుంటే వినడం కూడా చాలా గొప్ప అపరాధాలు. ఇలాంటివి చేయకుండా కాపాడమని సాయిని వేడుకోండి.

అమ్మగారు regular గా 17 తేదికి గొలగమూడి వస్తున్నారు. **చాలా చాలా గొప్ప సాధన. ఆ మహనీయుని సాన్నిధ్యానికి ఎంత శ్రమ పడితే అంత మంచిది.**

**ఇక్కడున్న మిలటరీ స్వామి పద్మాసనంలో కూర్చొని దేహత్యాగం చేశారు. March 24th న ధ్యానం చేస్తూ దేహం వదిలారు. వారు శ్రీ స్వామి సన్నిధి కొరకు పడ్డ కష్టాలకు అంతులేదు. అందుకు వారి చివరి క్షణాలే స్వామి వారి ప్రసాదం.**

మీ, పెసల సుబ్బరామయ్య

ఇక్కడ మిలిటరీ స్వామి స్వర్గస్తులయ్యారు. సాయినాధుని భక్తులలో మహల్సాపతి, శ్రీ వెంకయ్య స్వామి వారి భక్తులలో పోలిరెడ్డి గారు దేహత్యాగం చేసినట్లు చేశారు. మార్చి 24వ తేది మద్రాసులో తన సొంత రూమ్ లో పదిమంది మిత్రుల ఎదుట వారు ధ్యానం చేస్తూ శరీరం వదిలారు. శ్రీ స్వామివారి కోసం వారు గొలగమూడిలో ఉండేవారు. Latrine, బాత్రూం లేదు. ఇంటి గోడలు 4 అడుగులు ఎత్తు. ఈ కష్టాలన్నీ సంతోషంగా భరించాడు, గనుకనే వారికి ఉత్తమంగా శరీరం త్యజించే భాగ్యం కలిగింది.

పె. సుబ్బరామయ్య.

****** సద్గురు దేవా శరణం శరణం ******

# మార్గ దర్శకాలు

సార్ పైన సూచించిన విధానాలను ఎంతో పట్టుదల, శ్రద్ధ, ఓర్పు, వివేక, విచారాలతో వైరాగ్యం పొంది ఆచరిస్తున్నమా? చేయాలనీ ఉన్నా ప్రయత్నించము. పైగా స్వామి దగ్గరకు వచ్చి టెంకాయ కొట్టి, దండం పెట్టాము కదా మరి నా కష్టాలు తీరటము లేదు అని వాపోతాము. అటువంటి మనకు సార్ స్వామి భక్తుల అనుభవాలు చెప్పి, శ్రీ స్వామి మీద ఎంతో గౌరవం విశ్వాసము కలిగేలా చేసి, శ్రీస్వామిని సేవిస్తే, వారి కృప తప్పక కలుగుతుంది అని ఘంటాపధంగా చెప్పేవారు. **"నేనే అంతటా ఉన్నానని, నీ బాధ అంతా నాకు తెలుసునని, నీవు ఎక్కడున్నా, నేను నిన్ను చూస్తున్నాను"** అనే అనుభవాలెన్నో శ్రీ సార్ వారికిచ్చి, ఆ అనుభవాల ద్వారా శ్రీ స్వామిని సేవించుకునే టట్లు చేసేవారు. తన దగ్గరికి వచ్చే వాళ్ళకి నిరంతరం ఆనందాన్ని పంచే శ్రీ సార్ అనంత ఆనందమూర్తి గాక మరి

ఏమిటి? అందరూ శ్రీ సార్ లాగే అవ్వాలంటే తప్పక "శ్రీ సాయిమాస్టర్ బోధామృతం" చదివి, తెలుసుకుని, ఆచరిస్తే తప్పక ఆనందం పొందుతారు.

**సంక్షిప్తంగా "శ్రీ సాయిమాస్టారు బోధామృతం"నుండి** :

ఆలోచనలు లేకుండా జీవితం గడపమని ముఖ్య ఉపదేశం! ఎందుకంటే ఆలోచనలతో మనము క్రొత్త వాటిని సంపాదించుకుంటున్నాము. మన ఆలోచనలన్నీ మన అహంకారమే. మనం ఏమి ఆలోచిస్తాము? నాది, నీది, రాగ, ద్వేషం, మమకారాలు. అంటే మనం నిరంతరం మన సంస్కారాలలో మనం ఉంటాం. అదే మన అలవాటు. అది మనకు బాగుంటుంది. అందుకే దాంట్లోనే ఉంటాం. దీని కారణాల వల్లే కొత్త జన్మ జన్మ పరంపరలు పేనుకుంటాం. అందుకే మాస్టర్ గారు ధ్యానయోగసర్వస్వము లో వివేక పాట మందు ధ్యాస లేకుండా గడిపిన క్షణాలు లోని మనో వికారాలు జన్మ పరంపరలు పేనే త్రాళ్ళు అని గుర్తించి, విషాన్ని త్యజించినట్లు త్యజించు. అంటే మన ధ్యాస భగవంతుని మీద కాక నిరంతరము మన ఆలోచనలలో ఉంటుంది. మన ఆలోచనలు భవిష్యత్తు గురించి గానీ, గడిచిన వాటిని గురించి గానీ ఉంటుంది. కానీ ఇప్పుడు వర్తమానము అందు ఉండదు. వర్తమానంలో ఉండడం అంటే live at the present moment అని శ్రీ సార్ చెప్పారు. ఇది అలా ఉండాలి అంటే, అంతటా అన్ని రూపాలలో ఉండి నిరంతరము సర్వాన్ని సాక్షిగా చూస్తున్న దానిని చూస్తూ ఉండాలి. అలా ఉండాలంటే త్రికరణశుద్ధిగా (మనసు, మాట, చేత) నామ స్మరణ చేయుటయే మార్గం. మనం చేసే పని కౌశలంతో అంటే నేర్పుతో పని చేయాలని చెప్పారు. దానికి భావశుద్ధి లేనిదే జరగదు. అంటే శ్రీ సార్ చెప్పిన విధంగా భావాన్ని సరిచేసుకుని, త్రికరణశుద్ధిగా చేస్తే, 'live at present moment' సాధ్యం. మన ధ్యాస

భగవంతుని మీద నిలవదు. దీనికి ఆచరణ తప్ప మాటలతో అసలు పని లేదు. ఈ విషయాన్ని సద్గురు దర్గాస్వామి, శ్రీ నాంపల్లిబాబా ధృవపరిచిన సన్నివేశాలు:

**శ్రీశ్రీశ్రీ సద్గురు దర్గాస్వామిని "స్వామి! మేము ఏం చేస్తే, ఏ విధంగా నడుచుకుంటే మీకు తృప్తి కలిగించగలము?" అని అడగగా:**

**స్వామి**: మనసు నిలకడ చేసి ఏకాగ్రతతో నీలో ఉన్న సత్యమే అందరిలోనూ, అంతటా ఉందని తెలుసుకుంటే అందరికి తృప్తిగా ఉంటుంది. నాకూ తృప్తిగా ఉంటుంది.

**ప్రశ్న:** స్వామీ, మీరు నాలో ఉన్నదే అందరిలోనూ ఉంది అన్నారు, కానీ నాకు తెలియటం లేదు.

**స్వామి:** పాలను చూస్తూ వెన్న ఎక్కడ ఉంది ? నెయ్యి ఎక్కడ ఉంది అంటే ఎక్కడ ఉంటుంది. అదే విధంగా మనసు నిలకడ చేస్తే, ఏకాగ్రతతో నీలో ఉన్న సత్యం తెలుస్తుంది. ముందు నీలో ఉన్న సత్యం తెలిస్తే తరువాత అంతటా ఉన్నది తెలుస్తుంది. నామ స్మరణ చేస్తే మనసు నిలకడ అవుతుంది. పిలిచిన తక్షణమే (నామం చేసిన వెంటనే) సద్గురువే సరెండర్ అయ్యి మన చెంత ఉంటారు. ప్రేమతో నామ స్మరణ చేయి.

**"ఏది? నామస్మరణ చేయి!"** అన్నారు స్వామి. "సద్గురు దేవా శరణం శరణం" అనగా, స్వామి **"ఆ...హో... ఆహా..."** అని వారి యొక్క తృప్తిని వ్యక్తపరుస్తూ, **"ఇలా నామస్మరణ చేస్తూ ఉండు, మనసు నిలకడవుతుంది"** అన్నారు.

**శ్రీ నాంపల్లి బాబా వారి తీర్పు:**

ఇదేవిధంగా హృదయపూర్వక నామస్మరణతో **శ్రీ నాంపల్లి బాబా గారి దర్శనార్థం** వెళ్ళినప్పుడల్లా హృదయపూర్వకంగా అన్య

తలంపులు లేకుండా నామస్మరణ చేసుకుంటూ బాబానే మనసులో ధ్యానం చేస్తూ వారి దర్శనానికి వెడితే వారి స్పందన విశేషంగా ఉండేది. సిగరెట్ అడిగి తీసుకుని అగ్గిపుల్ల వెలిగిస్తే దాంతో అంటించడం కోసం మంచం దిగి ముందుకు వచ్చి సిగరెట్ వెలిగించుకుని త్రాగేవారు. తన దృష్టిని మనపై సారిస్తూ ప్రసన్నంగా ఉండేవారు. సాధారణంగా బాబాని స్పృశించి పాద నమస్కారం చేసుకునే అవకాశం ఉండదు. కారణం వారు ఉండే రూమ్ తలుపు గడియ పెట్టబడి ఉంటుంది. కానీ బాబా దర్శనానికి వచ్చేటప్పుడు వేరే చింతనలు లేకుండా అందరిలో బాబా ఉన్నారని భావన చేసుకుంటూ వస్తే ఏదో ఒక విధంగా బాబా స్పర్శ పాద నమస్కారం చేసుకునే భాగ్యం కల్పించేవారు. ఆ సమయానికి ఎక్కడో దూర ప్రాంతాల నుండి బాబా దర్శనం కోసం వచ్చిన వారు, అక్కడ వారిని బాబాకు నమస్కరించి పోవటానికి అడగటం, బాబా ఆ సమయాల్లో ప్రసన్నంగా ఉంటే తలుపు తీసి లోనికి పోనిచ్చేవారు. ఎవ్వరూ అలా రాకపోయినా మరేదో విధంగానైనా ఆ అవకాశాన్ని బాబా కల్పించేవారు. నామస్మరణ మనోనిగ్రహముల ఆవశ్యకత తెలియపరచడానికి.

అలా కాక దారిలో బస్సులో వచ్చేటప్పుడు అన్య చింతలతో, రోడ్డు మీద సినిమా పోస్టర్లు చూస్తూ, రోడ్డున పోయే అమ్మాయిలను చూస్తూ వెళితే ఇంకా ఇంటిలోకి ప్రవేశించకుండా నే కాళ్ళు కడుక్కుని మొదటి గది మెట్లు ఎక్కుతుండగానే బాబా ఏ రేయ్ రేయ్ అంటూ చాలా బిగ్గరగా అరిచే వారు. నిజానికి ఇంతకుముందు ప్రస్తావించినట్లు బాబా ఉండే గది నుండి ఎవరైనా వచ్చినది లేనిది కూడా మొదటి గది లోనే కనిపించదు. అయినా సర్వజ్ఞులైన బాబాకు ఆ తెరలు, గోడలు అడ్డా? అసలు వారి ఎదురుగా రానిచ్చేవారు కాదు. ఎంతోసేపు అలా అరుస్తూ ఉండేవారు. ఒకవేళ ఊరుకున్నా, మళ్లీ వారి ఎదురుగా వెళ్లగానే అరచి పక్కకి తొలగి పొమ్మని హెచ్చరించి అక్కడ నుండి మొదటి గదిలోకి వచ్చేలా చేస్తారు. ఆ

విధంగా బాబా దర్శనానికి వచ్చేటప్పుడు మనసును పవిత్రంగా నిలకడగా ఉంచుకోవాలని బాబా నోటితో వివరించకుండా అనుభవంతో హృదయగతం అయ్యేట్టు చేసారు. ఆ తర్వాత నెమ్మదిగా కేవలం బాబా దర్శనానికి వచ్చేప్పుడు భక్తిశ్రద్ధలతో రావడమే కాదని, ఆ వారం అంతటిలో ఎలా ఉన్నా వారికి తెలుస్తూనే ఉంటుందని, దర్శనానికి వెళ్లినప్పుడు ఏ విధంగా స్మరణతో వెళ్తామో, అదేవిధంగా ఈ రోజు కాలేజీకి వెళ్లి వచ్చేటప్పుడు ప్రయాణాల్లో ఉంటే వారికి అమిత ప్రీతి అని, దానికి విరుద్ధమైన నడవడి వారికి ఇష్టముండదని, ఎంతో స్పష్టంగా ఎన్నోమార్లు ప్రకటించేవారు. అంటే ఉదాహరణకు ఆ వారంలో కాలేజీకి వెళ్లి వచ్చేటప్పుడు స్మరణ చేయకుండా అన్య చింతలతో ఉండి, తర్వాత బాబా వద్దకు వెళితే ఎంతసేపటికైనా లేచి దర్శనం ఇచ్చేవారు కాదు. కనీసం వారి దివ్య ముఖారవిందమైనా చూసే భాగ్యం లేకుండా మరోవైపుకి తిరిగి పడుకుని ఉండేవారు. ఎన్ని గంటలు ఎదురుచూసినా ఒక్కసారైనా ఇటు తిరగడం కానీ, లేచి సిగరెట్ స్వీకరించడం కానీ వారి దృష్టి ప్రసరించడం గాని చేసేవారు కాదు.

హృదయపూర్వక స్మరణ చేయించిన సందర్భాలలో వారి అలౌకిక ఆనందాన్ని బిగ్గరగా నవ్వుతూ వ్యక్తపరచడం ద్వారా, మరియు అనంతకాల ఆలోచనారాహిత్య నవ్యచైతన్య అంతరంగ స్థితికి దర్పణమైన పారలౌకికానంద పారవశ్యభరిత ముఖారవింద ప్రేమపూరిత దృక్కులు సారించడం ద్వారానూ, వారు చెప్పక చెప్పిన సత్యం, సూచించిన మార్గం, చేరవలసిన గమ్యం ఒక్కటే!

## “నిజమైన స్వామి సేవ” గూర్చి 03-04-2006 న సార్ చెప్పింది.

తపస్సు అంటే నిద్రాహారాలను జయించడం అన్నది కరెక్టు. సర్వజీవులకు మేలు చెయ్యడం అని శ్రీ మాస్టారు చెప్పింది పై చెప్పిన విధంగా సాధించనిదే చేయలేము. ఎవరికో రేకుల

షెడ్డు కట్టడం, సైకిల్ తీసి ఇవ్వడం కాదు మేలు చేయడం అంటే. సంకల్ప మాత్రంతో వారి వ్యాధులు, బాధలు తీర్చడం. దానికి ముందు మనస్సు - కాలము ఇవ్వటం. మనస్సు ఇవ్వండి, ఇస్తుంటే వారే అన్నీ చేయిస్తారు.

## పై విషయాన్ని చెప్పటమే గాక ఆచరణ పూర్వకంగా నిరూపించిన (ఆచార్యులు) శ్రీ సార్ :

వినాయక చవితికి మూడు రోజులు సెలవులు వచ్చినప్పుడు గొలగమూడి వెళ్లాను. శ్రీ మాస్టారి రూములో "గురుదేవులు భరద్వాజ మాస్టారు" అన్న పుస్తకం చదువుతున్నాను. మధ్యాహ్నం రెండు గంటలకు అన్నం తిన్న తర్వాత తిరిగి ఆ పుస్తకం చదువుతూ ఉండగా 2:30 గంటలకి శ్రీ సార్ వచ్చారు. నేను క్రింద నేల మీద కూర్చుని చదవడం చూసి రూమ్ లోనికి వస్తూనే సార్ అక్కడ చాప తీసి పరిచారు. నేను దాని మీద కూర్చున్నాను. సార్ నేల మీదే కూర్చున్నారు. కాళ్లు మాత్రం కొంచెం చాప అంచు మీద ఉండేటట్లు కూర్చున్నారు. వారు ప్రతి వ్యక్తిలోనూ స్వామినే చూస్తూ ఆవిధంగా చేస్తారు కాబోలు అనుకున్నాను. సారు రెండు చేతులతో తల పట్టుకుని బాధగా "స్వామి ఎందుకు పెడతారో! అప్పుడప్పుడు! రాత్రి నిద్రలో కంట్లో ఏదో పడితే అప్పుడు నలిపాను కాబోలు, తెల్లవారేసరికి కన్ను వాచి మూసుకుపోయింది" అన్నారు. "చూస్తే కన్ను వాచి నీరు కారుతూ ఉంది. ఏమీ లేదు ఒట్టి పుణ్యాన ఒంగుతుంటే గోడ తగిలింది. ఇంత లావు వాచింది. కంటిపైన తలకు బొడిపి కట్టింది. కాళ్లు లాగుతున్నాయి. బాగా లాగుతున్నాయి. పొద్దస్త మానం పడుకో పడుకో అంటున్నాయి" అన్నారు. నేను వెంటనే లేచి ఇంట్లోకి వెళ్లి కొబ్బరి నూనె డబ్బా అడిగి తెచ్చి వెంటనే మూత తీసి కొంత చేతిలో వేసుకుని "సార్ కొబ్బరి నూనె రాసుకుంటే తగ్గిపోతుంది" అని సార్ ప్యాంటు పైకి ఎత్తుతున్నాను. సార్ కాళ్లు చాపి "కొబ్బరి నూనెకు

తగ్గుతుందా?" అని రెండు కాళ్ళకు ప్యాంటు పైకి తీశారు. నేను రెండు కాళ్లకు "మోకాళ్ళ వరకు నూనె రాస్తున్నాను". సార్ అన్నయ్య ఆరోగ్యం గురించి, సంపత్ గురించి, నాన్నగారి గురించి మాట్లాడారు. తర్వాత పాదాలకు కూడా రాశాను. పాదాల వద్ద మడిమల వద్ద పగుళ్లు ఉన్నాయి. తర్వాత సార్ "ఇక చాల్లే అయ్యా! తగ్గిపోతుందిలే!!" అన్నారు. "గురుదేవులు భరద్వాజ మాస్టారు" పుస్తకం చూసి "ఇది చదివావా?" అన్నారు సార్. "సగం చదివాను" అన్నాను. "అది ఎత్తుకుపో. ఇంకా చాలా ఉన్నాయి" అన్నారు.

తిరిగి పాల్వంచ వచ్చిన రాత్రి ఎప్పటిలాగే గుడి ఆవరణలో నిద్రించాను. మర్నాడు నిద్ర లేచే సరికి అక్కడ కన్స్ట్రక్షన్ వర్క్ కి కర్రలు కట్టడంవల్ల కాబోలు, కంట్లో ఇసుక పడడంతో నలిపినట్లు ఉన్నాను. నిద్రలో కన్ను వాచింది. నీరు కారడం ప్రారంభమయింది. పైకి లేస్తుంటే కర్ర తలకి తగిలి బొడిపి కట్టింది. అది సరిగ్గా సారు చూపించిన ప్రదేశంలోనే ! ప్రయాణంవల్లనో మరే మార్పో తెలియదు కానీ, బాగా వేడి చేసి కాళ్లు బాగా లాగడం మొదలయ్యింది. సరిగ్గా సార్ గొలగమూడిలో వచ్చేముందు వివరించిన ఇబ్బందులు యధాతధంగా వరుస క్రమం కూడా తప్పకుండా రావడం ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఇబ్బందులన్నీ నన్ను ఒకటి-రెండు గంటలలో, కాలేజీకి వెళ్లే సమయానికి వదిలేయడం, కేవలం **సార్ నాకు రాబోయే ఇబ్బందులను వారు స్వీకరించి అనుభవిస్తున్నానని ఘంటాపదంగా చెప్పడం కాదా ?** అట్టి అనంతా కరుణ, ప్రేమమయునికి నమస్కారములు. **శ్రీ సార్ త్రికాలజ్ఞులు, సర్వ సమర్థులే కాక అనంత కరుణామయులు, స్మృతిరహిత ప్రసన్నులు అని తెలుపుతుంది ఈ అనుభవం.**

**"ఆ మాస్టారే - ఈ మాస్టారు"** : ఆ (శ్రీ భరద్వాజ) మాస్టారే - ఈ (శ్రీ సుబ్బరామయ్య సార్) మాస్టారు!

సార్ స్వప్న సందేశం on 1st May 2003, తెల్లవారు జామున వచ్చిన కల: సుబ్బరామయ్య సార్ కలలో కనిపించారు. మొదట ఏవో చాలా ముఖ్యమైన విషయాలు చెప్పారు. తర్వాత వారి గురించి చెబుతూ "ఆ మాస్టారే ఈ మాస్టారు!" అని అన్నారు. అంటే భరద్వాజ మాస్టరే వారు అని చెప్పారు. ఈ చెప్పడానికి ముందే కలలో నా మనసులో విషయాలు వారికి స్పష్టంగా తెలుసునని నిరూపించి వారే మాస్టారు అని నిరూపించారు. పై మాట చెప్పిన తర్వాత నాకు దుఃఖం కట్టలు తెంచుకుని వచ్చింది. విపరీతంగా ఏడుస్తున్నాను. ప్రత్యక్షంగా ఎదురుగా ఉన్నా వినియోగించుకోలేక పోతున్నాను. ఆజ్ఞలను పాటించటం లేదే అని ఏడుస్తున్నాను. సార్ గమనిస్తూనే ఉన్నారు. లోపలికి వెళ్ళి కూర్చున్నారు. నేను కూర్చుని ఏడుస్తున్న చోటు వారికి కిటికీ గుండా కనిపిస్తోంది. మళ్లీ తర్వాత వచ్చి "ఎంత ఎత్తు నుండి నీళ్లలో పడితే అంత లోతుకు కూరుకుపోతారు" అన్నారు. ఇంకా కొంత తిట్టారు.

# నిత్య సత్యులు - ఇప్పటికీ, ఎప్పటికీ మార్గ దర్శకులు శ్రీ సార్!

19/12/19 నిన్నటి రాత్రి స్వప్నంలో సార్ లైవ్ సన్నివేశాన్ని - సందేశాన్ని అనుగ్రహించారు:

అన్నయ్య, ప్రసాద్, నేను సార్ వద్ద కూర్చుని ఉన్నాము. సార్ ఇలా అన్నారు "**మనం ఇతరులతో ఎలా ప్రవర్తించినా** (ఎవరితో ఏమన్నా, ఎవరి గురించి ఏం ఆలోచించిన చేసినా, అది అంతా) **ఆయనకే** (భగవంతునికి) **చెందుతుంది**" అన్నారు.

ప్రసాదుకు సార్ చెప్పినది సరిగ్గా వినిపించనందువల్లనో, లేక పక్కవారితో మాట్లాడుతూ ఉండటం వల్లనో కానీ చెప్పినది అర్థంగాక, సార్ ఏమి చెప్పారు అని అడిగితే, నేను ఇలా చెప్పాను "ఇతరులతో ప్రవర్తించేటప్పుడు వారిలో భగవంతున్ని చూస్తూ ఏం చేసినా అది భగవంతునికే చెందుతుంది అన్నారు" అన్నాను. అంటే నా ఉద్దేశ్యం ఇతరులలో భగవంతుని చూడకుండా ప్రవర్తిస్తే అది ఆయా వ్యక్తులకే చెందుతుంది (ఆ వ్యక్తుల ఎకౌంట్ లోనికి వెళ్ళినట్లు), లేకుంటే భగవంతుడితో డీల్ చేస్తూ ఉన్నట్లు అని. కానీ సార్ వెంటనే నవ్వుతూ "**అది కాదు స్వామీ! నేను చెప్పింది. నువ్వు వారిలో భగవంతున్ని చూసినా, చూడకపోయినా** (నువ్వు చూస్తే ఏంటి, చూడకపోతే ఏంటి? ఎలా అయినా, అన్నట్లు) **ఆ ప్రతీ చర్యలూ** (ఆలోచనలు, మాటలు, పనులు) **భగవంతునికే చేరుతాయి**" అన్నారు. వెంటనే నేను సార్ చెప్పిన విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా, నా ఉద్దేశ్యంలో (నాకు అర్ధం అయిన విధంగా) సార్ ఇలా చెప్పారు అని నిశ్చయముగా అనుకున్నందుకు నవ్వుతూ సార్ కు క్షమాపణ - sorry sir అని చెప్పి, భరద్వాజ మాస్టారు చెప్పిన విషయాన్ని "ప్రతివాడు కృష్ణుడు ఇలా చెప్పాడు అంటూ అసలు ఆయన చెప్పింది కాక, వాడు ఏమనుకుంటాడో అది కృష్ణుడు చెప్పాడనుకుంటాడు, చెప్తాడు. అసలు కృష్ణుడు చెప్పింది ఎప్పటికీ అర్థం చేసుకోడు" చెప్పి, నేను కూడా అలాగే చేసాను అని సార్ తో చెప్పుకొని ఎంతో హృదయపూర్వక ఆనందంగా సార్ సన్నిధిని enjoy చేస్తూ ఉన్నాను.

ఈ స్వప్నం ఆఫీసులో ఒకవ్యక్తి పనితీరు నాకు నచ్చక "నేను నీకు సెక్రెటరీనా, లేక నువ్వు నాకు సెక్రెటరీవా?" అనగా ఆవ్యక్తి పట్ల నా మనసులో న్యూనతా భావం బలపడుతుండగా సార్ ఇచ్చిన సందేశం.

సద్గురుభక్తులు ఎవరితో, ఎలా వ్యవహరించినా అది ఆ విశ్వగురునికే చెందుతుంది. కనుక త్రికరణశుద్ధి-భావశుద్ధి

అలవరుచుకొంటూ కర్తవ్యనిర్వహణనూ గురుసేవగా చేయాలని చెపుతున్నారా? సార్. నిత్యసత్యులు మరియు అందరి సంస్కారాలు సరిచేసే కరుణామయులు శ్రీ సార్.

**02/03/2021** తెల్లవారుజామున శ్రీ సుబ్బరామయ్య సార్ స్వప్న దర్శనమిచ్చారు. సాయిమాస్టార్ నిలయం ఎదురుగా బావివద్ద అత్తి చెట్టు కన్నా దగ్గర్లో ఉన్న Pin Paper Flowers type చెట్టు పువ్వులు ఎంతో భక్తితో, శ్రద్ధగా పూజచేసే వేషధారణలో (పంచె, కండువా, విభూతి బొట్టు) ఉండి కోస్తున్నారు. నేను కూడా కోయబోవగా, సార్ వద్దని సైగలతో మందలించారు. నేను ఇంకా స్నానం చేయనందున, బహిర్దేశానికి వెళ్లివచ్చిన బట్టలతో ఉన్నందున అన్నారేమోనని బాధపడ్డాను. అది చూసి సార్ నన్ను సరేలే, కోయి పర్వాలేదు అన్నారు. కానీ నేను సార్ ఎంతో భక్తితో వెంకయ్యస్వామి నామస్మరణతో (స్వయంగా వెంకయ్యస్వామికి పూజ చేస్తున్నట్లు) చేసే పని, నేను కేవలం బాధపడుతున్నానని స్వామికి ఇష్టం లేకున్నా చేయనున్నారని కోయకుండా ఉండిపోయాను. సార్ తర్వాత సాయిమాస్టర్ నిలయం గట్టుమీద (వరండాలో) కూర్చుని మాట్లాడటం మొదలు పెట్టారు. **సార్ అడిగిన ప్రశ్న "నువ్వు హృదయపూర్వకంగా సాధ్యమైనంత సమయం మానసికంగా స్వామితో కనెక్ట్ అయి ఉండడానికి ఏది నిన్ను అడ్డుకుంటోంది?"** అని, పక్కనే కూర్చున్న అన్నయ్యను చూపుతూ "ఇతని వల్లా?" అన్నారు. అలా పైకి అడిగారే కానీ నా హృదయంలోనే దానికి సమాధానం చెప్పబట్టి వెంటనే నేను "అయ్యో! దానికి ఎవరు కారణం కాదు సార్. నా బలహీనతలే అడ్డుపడుతున్నాయి" అని బాధతో సార్ కు క్షమాపణ చెప్పాను.

**01/10/21** ఈరోజు తెల్లవారుజామున శ్రీ సుబ్బరామయ్య సార్ స్వప్న దర్శనం ప్రసాదించారు: నేను గొలగమూడి వెళ్లాను. ఉదయం గొలగమూడి చేరగానే సార్ కనబడి, ఆ ట్రిప్ లో

మనోవాక్కాయ కర్మలలో ఎటువంటి మార్పులు తెచ్చుకోవాలో, దానికి తగిన సూచనలు summarise చేసినట్లు, నా మనసులో సాధనపై ఎంతో ఉత్సాహము-పట్టుదల పెంచి స్వామికృపకు అర్హుడనయ్యేందుకు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ఆకాంక్షను (కలలోనే) నాలో రేపారు సార్.

**మరునాటి నుండి** 40 రోజులు “శ్రీసాయిమాస్టర్ బోధామృతం” పారాయణ చేద్దామన్న నిశ్చయానికి రాగా ప్రసాదించిన ఈ స్వప్న సందేశం ద్వారా సార్ ఈ క్రింది అభయమిచ్చినట్లుగా ఉంది: **“ఆనందాశ్రమంగూర్చి చేసే ప్రయత్నం, అందులో భాగంగా ఈ పారాయణ చేయడం నా ప్రత్యక్ష సాన్నిధ్యంలో - ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. నేనే తగిన బోధచేయడం, అవసరమైన మార్పులు తీసుకువస్తూ మార్గదర్శనం చేస్తున్నాను, చేస్తాను”**.

2021 విజయదశమి రోజు రాత్రి సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ సమాధి సన్నిధిలో సత్సంగంలో కూడా **“శ్రమతో సేవ అంటే - మనస్సులో ఆలోచనలు లేకుండా ఉండటం”** అనే విషయాన్ని నొక్కి చెప్పటం పై అభయాన్ని నిరూపించినట్లుగా ఉన్నది!

# ముక్తి ప్రదాత

**శ్రీ సార్ రచించిన “నమ్మితే సొమ్ము, నమ్మకపోతే..” గ్రంధం లో “ముక్తి ప్రదాత” అను శిర్షిక నుండి : గొలగమూడి లో శ్రీ స్వామి వారే దిక్కని వచ్చి తరించిన భక్తుని (మిలటరీ స్వామి) అనుభవం**

గొలగమూడిలో 1996 ప్రాంతంలో మిలటరీస్వామి గారని ఒకరుండేవారు. 6 అడుగుల 2 అంగుళాల ఎత్తు. మిలటరీలో కల్నల్ పనిచేశారు. నలుగురు మగ పిల్లలు.

అందరూ ఆ రోజులలోనే నెలకు 40 వేల రూపాయల పైన సంపాదిస్తారు. ఈ మిలటరీ స్వామివారికి భార్య చనిపోయినది. మద్రాసులో సొంత ఇల్లు వుంది. దానిని ఒక సాధువుగారికిచ్చి అతని దగ్గర ఒక తాళంచెవి, మరియొక తాళంచెవి మిలటరీ స్వామి దగ్గర ఉంచుకొని మద్రాసు వెళ్ళినప్పుడు ఒకటి రెండు రోజులు ఉండి వచ్చేవాడు. **అతనికి తీవ్రమైన కోరిక : "ఈ జన్మలోనే మోక్షం పొందాలని".** అందుకే తన నలుగురు కొడుకులను, బంధువులను తన దగ్గరకు రాకుండా కట్టడి చేశాడు. **శ్రీ వెంకయ్యస్వామి మన కర్మను కొండంతలను గోరంతలుగా అనుభవింపజేసి చివరకు మోక్షమిస్తారు. అయితే అలా మోక్షం పొందేందుకు మననుండి హృదయపూర్వకమైన ప్రయత్నం ఎంత కష్టమైనా క్రమశిక్షణతో చేసి తీరాలి.** ఒక్కొక్కసారి అవసరమైన కష్టాలను తెచ్చి నెత్తిన పెట్టినట్లు మన (అజ్ఞానుల)కు కనిపించవచ్చు. కానీ మన కర్మ క్షాళన చేసేందుకు వారు అలా మన నెత్తికి కష్టాలు పెడుతుంటారు.

ఏ ఋణానుబంధమో తెలియదు గానీ ఒకరోజు ఎవరో వెళ్ళి స్వామివారిని చూడమని చెపితే గొలగమూడి వచ్చాడు. ఆ తొలి దర్శనములో వారినేమని పిలిచాడో స్వామి మనకు తెలియదు గానీ ఆనాటి నుండి వారి గొలగమూడిలో ఉండేవారు. ఆనాడు ఆయనకు దొరికిన చిన్న పూరింటికి 4 1/2 అడుగుల తలుపు ఈయన 6అ॥ 2 అం॥ పొడవైన మనిషి ప్రతి నిత్యం ఎన్నిమార్లు వొంగి ఇంటి లోపలకి పోవాలి. ఇంట్లో బావి లేదు. లెట్రిన్ లేదు. దొడ్డికి పోవాలంటే దూరంగా కర్రతుమ్మ చెట్లచాటుకు పోవాలి. వారికి షుగరు వ్యాధి వుంది. చెప్పులు వేసుకొని దొడ్డికి పోవాలి. వర్షపు బురదను చెప్పులు గుడ్డలపై చిమ్మేవి. ఆ గుడ్డలను వేరే పెట్టి నిత్యం అవే ధరించేవారు. నిత్యం ఉదయాన్నే టీ కొట్లు దగ్గర టీ త్రాగి శ్రీ స్వామివారి దగ్గర 1 గంట ప్రదక్షిణలు చేసి కూరగాయలు, ఇడ్లీలు ఇంటికి తీసుకుపోయి, వేడినీరు పైనే కాచుకొని స్నానం చేసేవారు. తర్వాత పూజ,

అగ్నిహోత్రము అయ్యాక ఇడ్లీ తిని వంట చేసి 10 గంటలకు తిరిగి మందిరంలో ప్రదక్షిణలు చేసి తీర్థప్రసాదాలు తీసుకొని ఇంటికి వచ్చి పారాయణ, ధ్యానం చేసి ఒంటిగంటకు భోంచేసి మరలా ఆధ్యాత్మిక పుస్తకాల పారాయణ, 4 గం|| కి మరలా మందిరంలో ప్రదక్షిణలు చేస్తూ నిర్విరామంగా కాలం గడిపేవాడు. ఇంటి ఓనరు యొక్క సామానులన్నీ ఆ ఇంట్లో ఒక ప్రక్కనుండేవి. ఒకరోజు ఇంటిఓనరు స్వామివారికి చెప్పకుండా ఆయన నీళ్ళు కాచుకునే అల్యూమినియం గిన్నె తీసుకువెళ్ళింది. స్వామి ఆ గిన్నెను వెతుకుతూ పూజకు టైం అయిపోయింది. ఆమెను ఘాటుగా నాలుగు చీవాట్లు పెట్టారు. ఆమె స్వామిని తక్షణమే ఖాళీ చేయమన్నది. ఆయనకు ఊరంతా తిరిగినా ఇల్లు దొరకలేదు. నెల్లూరులో కాపురముండి రోజూ శ్రీ స్వామివారి దర్శనార్థం వస్తానన్నాడు. ఎంత చెప్పినా వినలేదు. వర్షాకాలం కంటేపల్లి మీదుగా బస్సు రాదు అని చెప్పినా వినలేదు. ఈయన స్వామివారికి నమస్కరించేందుకు పోతుంటే ఒకతను స్వామి మందిరం వెనుకు మంచి ఇల్లు చూపించాడు. వెంటనే దానికి మారిపోయాడు. ఖాళీ స్థలం కొని ఇల్లు కట్టివ్వమని 2000 రూపాయలు ఒకరిస్తే వారు ఇల్లు కట్టివ్వలేదు. ఈ టైంలో నీకు ఇల్లు ఊడ్చి, అంట్లు తోమిస్తానని ఒకఆమె బయలు దేరి ఆ స్థలం తానే తీసుకున్నది. ఆమె స్వామికి అన్నం కూడా వండుతుంది. ఈమె ఒకనికి ఉంపుడుకత్తే. వాళ్ళిద్దరూ పడుకొని ఉండడం స్వామి చూచి ఆమెను తన సేవ నుండి తొలగించారు. ఆమె స్వామిపై ఎన్నో చెడ్డ ప్రచారాలు చేసింది.

దానితో స్వామికి విరక్తి కలిగి మరలా నెల్లూరు కాపురం పోతానని మొండికేశాడు. నిత్యం నీవు నెల్లూరు నుండి రాలేవని చెప్పినా వినలేదు. సరే మీ ఇష్టం అని వదిలేశాను. ఈయనకు ఒక మనిషి ఎదురొచ్చి మా ఇంట్లో ఒక గది ఉంది చూడమని తీసుకెళ్ళి చూపించాడు. ఇంట్లో బావి వుంది. మిద్దె ఇల్లు. భార్యభర్తలు తప్పితే ఇక ఎవ్వరూ లేరు. వెంటనే అడ్వాన్సిచ్చి

చేరాడు. రెండు నెలలు గడిచేసరికి ఇంటి ఓనర్ భార్య అనేక విధాలుగా నస పెడుతుంది. ఆమె ప్రవర్తన గురించి ఆమె భర్తకు చెప్పాడు. భర్త భార్యను కొడుతున్నాడు. అయ్యో! నా మూలాన వారిద్దరికీ తగాదా వచ్చిందని స్వామి తొందరలో అడ్డం తీయబోయాడు. తెరచియున్న కిటికీ రెక్క మూలభాగం స్వామి నడి నెత్తికి తగిలి గాయమై లొడలొడ రక్తం కారుతుంది. గాయానికి కాఫీ పొడి పెట్టి కట్టు కట్టుకొని ప్రక్కనున్న ఇంటికి వచ్చి మరలా నెల్లూరు మకాం మారుస్తానన్నాడు. నేను వద్దన్నా వినలేదు. మొదటి పూరిల్లు ఖాళీ చేసేటప్పుడు కూడా మా ఇంట్లో ఆ రూము ఖాళీగా వుంది. అయితే నాకు ఐడియా ఇప్పుడు వచ్చింది గానీ అప్పుడు వస్తే ఇన్ని ఇండ్లు మారే అవసరముండేది కాదు. కనుక రూము ఇలా ఆల్టరేషన్ చేసి ఇస్తాను సరిపోతుందేమో చూడమన్నాను. వెంటనే రూము తయారు చేసి, ఫ్లోరింగ్ చేయించి ఇమ్మని 3 వేలు ఇచ్చాడు. మా ఇంట్లో బావి, లెట్రిన్ అన్ని వసతులు వున్నాయి. హాయిగా వున్నాడు. ఇన్ని కష్టాలు పడుతూ ప్రారబ్ధం ఖర్చుపెట్టుకున్నారు.

పన్ను నొప్పి వచ్చింది. పన్ను పెరికించాడు. నొప్పి పోలేదు. మరలా చిగురులు ఓపెన్ చేసి ఏదో చేశారు. నొప్పి పోలేదు. మూడవసారి పంటి నరాలను కాలుస్తానన్నా చేయమన్నారు. అందుకు నేను చెప్పాను "మీరు కోరింది జన్మరాహిత్యం గదా అది అనుగ్రహించే లోపల కొండంత ప్రారబ్ధాన్ని గోరంతగానైనా అనుభవించాలి గదా! అందుకే స్వామి చేయడం లేదన్నాను.

భాగవతం ఇంగ్లీషులో ఉన్నది నాలుగువేల రూపాయలకు నాలుగు అట్టపెట్టెల బైండు పుస్తకాలు తెచ్చాడు. ఎంతో నిమగ్నమై చదివేవాడు. ప్రక్కన ఎవరు నిలబడ్డారు అనేది తెలియదు. ఒక్కొక్కసారి ఆకాశం వైపు చూస్తూ అలాగే రెప్ప ఆర్పకుండా చూస్తూండేవాడు. ఈ పరిస్థితిలో ఆయనకు వంట చేసి పెట్టే పెద్దామె కుదిరింది. నీకు కావలసినంత తిను, నాకు

కాస్త పెట్టు నీవు శ్రమ పడ వద్దనేవాడు. ఇప్పుడు శ్రీ దర్గాస్వామి, నీలకంఠరావుపేట, కడప జిల్లా వెళ్ళాడు కనీసం పంటి నొప్పులు తగ్గిస్తాడని. వారు ఈయనను ఒక రాత్రి దర్గాల దగ్గర నిద్ర చేయమని, తెల్లవారి చెపుతానన్నారు. తెల్లవారి "అయ్యా! నీకేమీ చేయాలన్నా వెంకయ్యస్వామి అంగీకరించడం లేదు నీవిక వెళ్ళి పొమ్మని" చెప్పారు. మిలటరీస్వామివారు శ్రీ వెంకయ్యస్వామిని కోరింది జన్మరాహిత్యం కొండలు కొండలుగా ఉండే ప్రారబ్ధాన్ని గోరంతలుగానైనా అనుభవించాలిగదా? అలాగే అనుభవింపచేసి ఎవ్వరికీ రాని విధంగా వారి చివరి శ్వాస ధ్యానంలో తీసివేశాడు.

**షిరిడీసాయి చరిత్రలో శ్రీ దీక్షిత్ గారికి కైవల్యమిచ్చిన విధంగా వుంది. శ్రీ వెంకయ్యస్వామి చరిత్రలో రోశిరెడ్డికి కైవల్యమిచ్చినట్లుంది.** ఒకరోజు నాకు గుండెనొప్పిగా ఉంది. మద్రాసులో చూపించి వస్తానని వెళ్ళాడు. అక్కడ డాక్టరుకు చూపి ఏదో ఇంజక్షను, మాత్రలు తీసుకున్నాడు. తెల్లవారి ఆయన మిత్రబృందమంతా వచ్చి ఆయన ముందు కూర్చొని ధ్యానం చేస్తున్నారు. వాళ్ళ తమ్ముని కొమారుడు "భోం చేసి కూర్చోండి. ధ్యానానికి" అని పిలిచాడు. వీరు పలకలేదు. ఐదు నిమిషాల తర్వాత తట్టి లేపాడు. ఆయన తనువు చాలించాడని తెలుసుకున్నారు. **గొలగమూడిలో వారు పడ్డ కష్టాల ద్వారా ఋణానుబంధాలు, నీళ్ళ ఋణం, నిద్ర ఋణం తీర్చి చివరకు ధ్యానం చేస్తూ తనువు చాలించే భాగ్యం ప్రసాదించాడు భగవంతుడు.**

# శ్రీ శ్రీ శ్రీ సుబ్బరామయ్య సార్ సిద్ధాంత ప్రణాళిక

## *శ్రీ సార్ ఆచరించి సూచించిన సాధనా మార్గాలు*

1. గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి వంటి మహాత్ముల సన్నిధిలో ఎక్కువ సమయము గడపమని చెప్పేవారు.

2. శ్రమతో సేవ - సేవతో కైవల్యం : అందరి చేత సద్గురు సేవ, పుణ్య కార్యక్రమములు చేయించేవారు.
3. పుస్తక ప్రచురణ, సత్సంగము ద్వారా ధర్మ ప్రచారము చేయుట.
4. శ్రీ స్వామివారు బోధించిన పంచశీల సూత్రములు (సత్యము, ధర్మము, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ) ఆచరించమని చెప్పుట.
5. గొలగమూడి సందర్శకులకు తనను సందర్శించిన వారితో నిరంతరమూ మహాత్ముల అనుభవాలు, తృప్తి, శాంతి, ఆనందం పొందు మార్గం విశదీకరించుట.
6. గొలగమూడి సందర్శకులకు అన్ని సదుపాయములు కల్పించుట ద్వారా స్వామి భక్తులకు సేవ చేయటం.

ఆనందము పొందాలంటే తప్పక మహనీయుల సన్నిధిలో గడపాలని, అందుకు పుణ్య కార్యాలు (ఏదో ఒక జీవికి ఏ చిన్న ఉపకారం అయినా) చేయాలి అని, అన్నిటికంటే గొప్ప పుణ్యము ఆలోచనా రహితముగా ఉండటమని, దీని ద్వారా తప్పక కైవల్యము పొందుతారు అన్న దివ్య సందేశాన్ని ఆచరించి, మనందరికీ అందించారు. అలా కష్టించి ఆలోచనా రహితముగా ఉండేందుకు శ్రీ సార్, మాష్టారు ప్రచురించిన పుస్తకాలలోని ధర్మమును తెలుసుకుని, ఆచరించాలి. ఆచరిస్తే గాని మనకు వారి కృప కలగదు. అందుకు వాచాశూరత్వం గాక క్రియా శూరత్వములో చూపాలి. ఇలా జీవిస్తూ అందరూ తను అనుభవించే ఆనందము, హాయి పొందాలని తన దగ్గరికి వచ్చే వాళ్ళందరికీ “శ్రీ మాస్టర్ గారి బోధామృతం” పంచడమే తన ధ్యేయంగా నిరంతరము పంచేవారు.

నిరంతరము శ్రీ సార్ అంతటా ఉండి, తన వాళ్లతో, "నువ్వు ఎక్కడున్నా, నేను ఇక్కడి నుంచి చూస్తూనే ఉంటానని చెప్పుట" ద్వారాను, మనము ఎవరితో వ్యవహరించినా, ఏది చేసినా అది

అంతా శ్రీ సార్ కు తెలుస్తుందనే అనుభవాలు ఇచ్చి, మన అందరిని మనకు తెలిసినా, తెలియకపోయినా శ్రీ సార్, “శ్రీసాయి శుభ్రమార్గం” లో నడుపుతున్నారు. మనము, శ్రీ సార్ మన వైపు చూస్తుంటే మనం ఎక్కడో చూడకుండా శ్రీ సార్ వైపు చూస్తుండే దానికి, హృదయపూర్వక ప్రయత్నం చేసి తరిద్దాం. శ్రీస్వామిని, శ్రీ సార్ ను దర్శించే వాళ్లకి గొలగమూడిలో ఉండేందుకు వివిధ సౌకర్యములు కల్పించు సేవలో పాలుపంచుకుని తరిద్దాము.

శ్రీ సాయి మాస్టారు సేవా ట్రస్టు
గొలగమూడి.



**ఆనందాశ్రమం నిర్మాణ పనులు చేస్తూ శ్రీ సార్**